# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 31 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల సోమవారం 5 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 31 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA MON 5 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur





# ఏపీలో 'తల్లికి వందనం'.. రెండో విడతకు రంగం సిద్ధం

- సుమారు 3.29 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.13,000 జమ
- ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం.. సీఎంవో అనుమతి కోసం నిరీక్షణ
- వచ్చే వారం లేదా రెండు వారాల్లో నిధులు విడుదలయ్యే అవకాశం




ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి తుది అనుమతి రావడమే మిగిలి ఉంది. సీఎంవో నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన

- మిగతా 2లో

# ఫ్లైదుబాయ్ ఘటన తరహాలో దాడులు చేయండి..
## అల్ ఖైదా మద్దతు పత్రిక పిలుపు

- అమెరికా, ఇజ్రాయెల్ విమానాలపై దాడులకు అల్ ఖైదా మద్దతుదారుల పిలుపు
- ఇటీవలి ఫ్లైదుబాయ్ హైజాక్ యత్నాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచన
- 9/11 దాడులను గుర్తుచేస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కథనం
- 'అల్ బయాన్' అనే వారపత్రికలో ఈ మేరకు పిలుపునిచ్చిన ఉగ్రవాదులు

- మిగతా 2లో





# అది ఆగ్రహం కాదు, ఉత్సాహం..
## జైరాం రమేశ్‌కు చంద్రబాబు, లోకేశ్ కౌంటర్

- మదనపల్లె సభపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ట్వీట్
- ప్రజాగ్రహం అంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్యలు
- తీవ్రంగా స్పందించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్
- అది ప్రజల ఉత్సాహమే తప్ప ఆగ్రహం కాదని చంద్రబాబు వివరణ
- వాస్తవాలు తెలుసుకోకుండా ట్వీట్ చేస్తారా అంటూ లోకేశ్ ఫైర్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, తప్పుడు సమాచారం ఆధారంగా వ్యాఖ్యలు చేయడం ఏంటని వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అది ప్రజాగ్రహం కాదని,

- మిగతా 2లో



## జైరాం.. మీరింత తొందరపడతారని
# నేను అనుకోలేదు

- జైరాం రమేశ్ పోస్టుపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం
- ఏపీ సభలో కనిపించింది ప్రజల ఉత్సాహమేనని స్పష్టీకరణ
- అది ప్రజాగ్రహమంటూ జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలపై దుమారం
- కాంగ్రెస్ నేతపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తీవ్ర అభ్యంతరం
- అన్నమయ్య జిల్లా సభ ఘటనపై సోషల్ మీడియాలో మాటల యుద్ధం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో స్పందించారు. "జైరాం, నమ్మలేకపోతున్నాను. మీరింత తొందరపడతారని

- మిగతా 2లో

# 3డీ ప్రింటింగ్ తో పేదల ఇళ్లు..
## చంద్రబాబు సర్కారు వినూత్న ముందడుగు

- రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- మరో 6 లక్షల ఇళ్ల మంజూరుకు కేంద్రమంత్రి హామీ
- బుర్రిపాలెంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్టు
- 2029 నాటికి పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామన్న సీఎం చంద్రబాబు
- ఏపీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్ అన్న శివరాజ్‌సింగ్ చౌహాన్



ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. అత్యాధునిక 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో వేగంగా, పటిష్టంగా, తక్కువ ఖర్చుతో ఇళ్లను నిర్మించే బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో, ఏకంగా 9 లక్షల ఇళ్లను నిర్మించి పేదలకు పట్టాభిషేకం చేయాలని సంకల్పించింది. ఈ మహాయజ్ఞంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి

- మిగతా 2లో

# విమానాన్ని కూల్చేయాలనుకున్నా: ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

- ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేయాలన్నది తన ప్లానేనన్న కోపైలట్
- విచారణలో నేరాన్ని అంగీకరించిన హమామ్ అల్-హమామీ
- కెప్టెన్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి దాడి చేశానని వెల్లడి
- హమామ్ సోషల్ మీడియాలో వేలకొద్దీ ఉగ్రవాద పోస్టుల గుర్తింపు
- ఈ కుట్ర వెనుక ఉగ్రసంస్థల హస్తంపై ఇజ్రాయెల్, సౌదీ ఏజెన్సీల దర్యాప్తు



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఫ్లైదుబాయ్ ఘటన తరహాలో దాడులు చేయండి..

## అల్ ఖైదా మద్దతు పత్రిక పిలుపు

అంతర్జాతీయంగా మరోసారి ఉగ్రవాద దాడుల కలకలం రేగింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన విమానాలపై దాడులు చేయాలంటూ అల్ ఖైదా మద్దతుదారులు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన ఫ్లైదుబాయ్ విమాన హైజాక్ యత్నాన్ని, 2001 సెప్టెంబర్ 11 దాడులను స్ఫూర్తిగా తీసుకుని 'కాపీక్యాట్ దాడులు' (అచ్చం అలాంటి దాడులే) చేయాలని తమ పత్రిక ముఖంగా రెచ్చగొట్టారు. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా భద్రతా ఏజెన్సీలను అప్రమత్తం చేసింది. అల్ ఖైదా మద్దతుతో నడుస్తున్న 'అల్ బయాన్' అనే అరబిక్ వారపత్రిక ఈ మేరకు ఓ కథనాన్ని ప్రచురించింది. "యుద్ధం ఇంకా ముగియలేదు. జియోనిస్టులు, అమెరికన్లు, ఇస్లాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఇతర అవిశ్వాసులను మోసుకెళ్లే విమానాలు ఇంకా ఆకాశంలో ఎగురుతూనే ఉన్నాయి. సెప్టెంబర్ 11, సెప్టెంబర్ 30న జరిగినట్లుగా వాటిని లక్ష్యంగా చేసుకోవచ్చు" అని ఆ కథనంలో పేర్కొన్నారు. 9/11, ఫ్లైదుబాయ్ ఘటనలకు సంబంధించిన చిత్రాలను కూడా దీనికి జోడించారు. కొద్ది రోజుల క్రితం దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని నేలకూల్చేందుకు విఫలయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఆ విమాన కో-పైలట్, కాక్‌పిట్‌లోని గొడ్డలితో కెప్టెన్‌పై దాడి చేసి విమానాన్ని తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో విమానం వేగంగా కిందకు దూసుకెళ్లి పెను ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. ఈ హైజాక్ యత్నానికి పాల్పడిన కో-పైలట్ ఒమన్‌కు చెందినవాడని, అతనికి తీవ్రవాద భావజాలం ఉందన్న కారణంతో గతంలోనే ఒమన్ అధికారులు విమానాలు నడపకుండా నిషేధం విధించారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలోనే అల్ ఖైదా మద్దతుదారులు ఈ ఘటనను ఓ విజయంగా చిత్రిస్తూ దాడులకు పిలుపునివ్వడం గమనార్హం. శనివారం టెలిగ్రామ్ ఛానళ్లలో ఈ పోస్ట్ సర్క్యులేట్ అయినప్పటికీ, ఆ తర్వాత దానిని తొలగించినట్లు తెలుస్తోంది.

# అది ఆగ్రహం కాదు, ఉత్సాహం..

- మొదటి పేజి తరువాయి

ప్రజల ఉత్సాహం అని స్పష్టం చేస్తూ ఘాటుగా బదులిచ్చారు.

**అసలేం జరిగింది?**

ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతుండగా, సభలో ఉన్న కొందరు యువకులు కేకలు, అరుపులతో కాస్త గందరగోళం సృష్టించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని, వారిని శాంతపరిచి ప్రసంగం సజావుగా సాగేలా చూశారు. అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే నెటిజన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 'మొదట ఉద్యోగాలు ఇవ్వండి' అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జోడించాడు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు.

**చంద్రబాబు, లోకేశ్ తీవ్ర స్పందన**

జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "జైరాం జీ, జరిగిన దానికి మీ వ్యాఖ్యానానికి ఏమాత్రం సంబంధం లేదు. మీరు దేన్నైతే ప్రజాగ్రహం అని తప్పుగా చిత్రీకరించాలని చూస్తున్నారో, అది వాస్తవానికి ప్రజల నుంచి వచ్చిన అపూర్వమైన, ఉత్సాహపూరితమైన స్పందన. సభలో వారి ఉత్సాహం అధికంగా ఉండటంతో, కార్యక్రమం సజావుగా సాగేందుకు నేను జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ప్రజల ఉత్సాహాన్ని ఆగ్రహంగా పొరబడటం చూస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలకు మీరు ఎంత దూరంగా ఉన్నారో అర్థమవుతోంది. రాజకీయ ప్రేరేపిత సోషల్ మీడియా కథనాలతో వాస్తవాలను మార్చలేరు" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

మంత్రి నారా లోకేశ్ కూడా ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. "ఫేక్ న్యూస్‌ను తయారుచేసేది ఇలాగే. సీనియర్ కాంగ్రెస్ నేతలు వాస్తవాలను కూడా సరిచూసుకోకుండా దాన్ని ప్రచారం చేస్తారు. ఉద్యోగాలు కావాలంటూ ఆర్థిక మంత్రి ప్రసంగానికి స్థానిక యువత అంతరాయం కలిగించారన్నది పూర్తిగా అవాస్తవం. ప్రజలతో సాధారణ సంభాషణను ఉద్దేశపూర్వకంగా కత్తిరించి, వక్రీకరించి కట్టుకథ అల్లుతున్నారు. జైరాం రమేశ్ గారూ, మీలాంటి సీనియర్ నేత ట్వీట్ చేసే ముందు వాస్తవాలు సరిచూసుకోవాలి. ఉద్దేశపూర్వక తప్పుడు సమాచారం తగదు. ఆ అబద్ధాన్ని తొలగించండి" అని లోకేశ్ డిమాండ్ చేశారు.

# 'కమర్షియల్'కు క్వీన్ ఆమెనా..?

- సీనియర్‌ను రానివ్వకుండా... మొత్తం కమర్షియల్‌ను 'అమ్మ' కంట్రోల్‌లోకి తీసుకున్నారా?
- 'అమ్మ' ప్రసన్నమైతేనే పని ముందుకా?
- వెసల్‌కు బెర్త్ కావాలంటే ఒక రేటు ఉందా?
- డబ్బులు ఇస్తే బెర్త్‌పై పని... ఇవ్వకపోతే యాంకరేజ్‌కా?
- "పైవారికి ఎవరి వాటా వారికి పంపిస్తా" అంటున్నారన్న ఆరోపణల్లో నిజమెంత?
- ఆన్‌లైన్ సిస్టమ్ ఉన్నా పర్సనల్‌గా కలవాల్సిందేనా?
- జూనియర్ స్టాఫ్‌ను సొంత పనులకు వాడుకుంటున్నారా?
- 'గ్రీన్ ఎనర్జీ' వెనుక అసలు కథేంటి?
- విజిలెన్స్ ఉన్నా ఫోన్, మెయిల్ పనిచేయవా?
- గతంలో సీబీఐ రైడ్ జరిగినా మార్పు రాలేదన్న ప్రచారంలో నిజమెంత?

'పెన్ పవర్' ఇన్వెస్టిగేషన్ గ్రౌండ్ రిపోర్ట్ । ఎపిసోడ్--2

**ఇన్వెస్టిగేషన్ నెట్ వర్క్ , పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబర్ 04 :** విశాఖపట్నం పోర్టు కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌లో అసలు ఎవరి మాట నడుస్తోంది? రూల్స్ ప్రకారం వ్యవస్థ నడుస్తోందా? లేక మొత్తం వ్యవస్థ ఒకే అధికారి కంట్రోల్‌లోకి వెళ్లిందా? పోర్టు వర్గాల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. ఆ చర్చలో పదేపదే వినిపిస్తున్న పేరు కాకుండా ఒకే పిలుపు- 'అమ్మ'

**సీనియర్‌ను రానివ్వకుండా... టోటల్ కంట్రోల్?**

కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అధికారి ప్రత్యక్షంగా వ్యవహారాల్లోకి రాకుండా, కీలకమైన నిర్ణయాలన్నీ తన కంట్రోల్‌లోనే ఉండేలా 'అమ్మ' వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ ఫైల్ ముందుకు వెళ్లాలి? ఏది పెండింగ్‌లో ఉండాలి? ఎవరికి ముందుగా అప్రూవల్ రావాలి? ఎవరు వెయిట్ చేయాలి? ఏ వెసల్‌కు బెర్త్ ఇవ్వాలి? అన్న విషయాల్లో ఒకే వ్యక్తి ప్రభావం ఎంత ఉందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. సీనియర్ అధికారులకు పూర్తి సమాచారం వెళ్తోందా? లేక కమర్షియల్‌లోనే కథ ముగుస్తోందా?

**ప్రతి వెసల్‌కు ఒక 'రేటు' ఫిక్స్ చేశారా?**

పోర్టుకు వచ్చే ప్రతి కార్గో వెసల్‌కు బెర్త్ ఇవ్వడానికి ఒక అనధికారిక రేటు ఫిక్స్ చేశారన్న సమాచారం కొన్ని వర్గాల నుంచి వినిపిస్తోంది. నిజంగా అలాంటి రేటు ఉందా? ఉంటే ఎవరు నిర్ణయిస్తున్నారు? ఏజెంట్‌తో ఎవరు మాట్లాడుతున్నారు? పేమెంట్ ఎక్కడ జరుగుతోంది? బెర్తింగ్ ప్రోగ్రామ్‌కు ముందు డీల్ జరుగుతోందా? లేక బెర్త్ వచ్చిన తర్వాత మొదలవుతోందా? వెసల్ బెర్తింగ్ రికార్డులు, ఏజెంట్ కమ్యూనికేషన్, ఫైల్ మూవ్‌మెంట్ బయటకు వస్తే నిజం తేలుతుంది.

**"పైవారికి వాటా పంపిస్తా" అంటున్నారా?**

"నాకు మాత్రమే కాదు... పైవారికి ఎవరి వాటా వారికి పంపిస్తా" అన్న తరహాలో బహిరంగంగా మాట్లాడుతున్నారన్న సమాచారం. అసలు ఆ 'పైవారు' ఎవరు? నిజంగానే ఎవరికైనా వాటాలు వెళున్నాయా? లేక పై అధికారుల పేర్లు చెప్పి ఏజెంట్లను భయపెడుతున్నారా? ఈ ఆరోపణ నిజమైతే విచారణ 'అమ్మ' దగ్గర ఆగకూడదు. డబ్బు వెళ్లే చివరి పాయింట్ వరకు వెళ్లాలి.

**డబ్బులు ఇస్తే బెర్త్... లేకపోతే యాంకరేజ్?**

వెసల్ బెర్త్ మీదకు వచ్చిన తర్వాత మరో రకం ఒత్తిడి మొదలవుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. "పని సరిగ్గా జరగడం లేదు." "కార్గో హ్యాండ్లింగ్ స్లోగా ఉంది." "పర్ఫార్మెన్స్ బాగోలేదు." అంటూ ఏజెంట్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారట. అక్కడే అసలు ప్రశ్న. డబ్బులు ఇస్తే అదే వెసల్ బెర్త్‌పై కొనసాగుతుందా? డబ్బులు ఇవ్వకపోతే : "యాంకరేజ్‌కు షిఫ్ట్ చేయండి" అనే ఆదేశం వస్తుందా? ఎందుకంటే ఒక వెసల్‌ను బెర్త్ నుంచి యాంకరేజ్‌కు పంపడం వల్ల షిప్పింగ్ కంపెనీకి సమయం, ఇంధనం, నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ఈ విషయంలో వెసల్ పర్ఫార్మెన్స్ రిపోర్టులు, కార్గో హ్యాండ్లింగ్ వివరాలు, షిఫ్టింగ్ ఆర్డర్లు, యాంకరేజ్ రికార్డులు, ఏజెంట్ కంప్లైంట్లు, బయటకు రావాలి. డబ్బు ఇచ్చిన వెసల్‌కు ఒక రూల్... ఇవ్వని వెసల్‌కు మరో రూల్ అమలవుతోందా? అన్నది తేలాలి.

**'అమ్మ' సంతకం కోసం పడిగాపులా? :** కమర్షియల్‌లో సంతకం కోసం ఏజెంట్లు గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఫైల్ కంప్లీట్. డాక్యుమెంట్స్ కంప్లీట్. ఆన్‌లైన్ అప్లికేషన్ కంప్లీట్. అయినా---

**'అమ్మ'ను పర్సనల్‌గా కలవకపోతే అప్రూవల్ రాదా? :** అదే ఇప్పుడు ఏజెంట్ల ప్రశ్న. ఆన్‌లైన్ సిస్టమ్ ఉంటే పర్సనల్ విజిట్ ఎందుకు? పర్సనల్ విజిట్ తప్పనిసరి అయితే ఆన్‌లైన్ సిస్టమ్ ఎందుకు?

**జూనియర్ స్టాఫ్ కూడా 'అమ్మ' సొంత పనులకా? :** కిందిస్థాయి ఉద్యోగులను కూడా అధికారిక డ్యూటీలకు కాకుండా వ్యక్తిగత పనులకు ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరిని? ఏ పనికి? ఎన్ని సార్లు? డ్యూటీ టైమ్‌లోనా? పోర్టు వెహికల్స్ ఉపయోగించారా? దీనికి సమాధానం చెప్పేది--- అటెండెన్స్ రికార్డు, డ్యూటీ రోస్టర్, వెహికల్ లాగ్ బుక్, గేట్ ఎంట్రీ, సీసీటీవీ ఫుటేజ్. రికార్డులు ఓపెన్ చేస్తే నిజం బయటపడుతుంది.

**'గ్రీన్ ఎనర్జీ'... అసలు కథేంటి? :** కమర్షియల్‌లో ఇప్పుడు మరో పేరు బలంగా వినిపిస్తోంది, 'గ్రీన్ ఎనర్జీ' గ్రీన్ ఎనర్జీకి సంబంధించిన అసలు వ్యవహారం ఏమిటి? ఏ కంపెనీ? ఏ ప్రాజెక్ట్? ఎవరు ప్రపోజ్ చేశారు? ఎవరు రికమెండ్ చేశారు? ఎవరు అప్రూవ్ చేశారు? కమర్షియల్ డిపార్ట్‌మెంట్ పాత్ర ఎంత? ఏదైనా ప్రత్యేక ప్రయోజనం కల్పించారా? ఈ ఫైల్ బయటకు వస్తే 'గ్రీన్ ఎనర్జీ' వెనుక గ్రీన్ సిగ్నల్ ఎవరిదో తెలుస్తుంది.

**ఏజెంట్లపై ప్రెజర్ ఎందుకు? :** షిప్పింగ్ ఏజెంట్లు బహిరంగంగా మాట్లాడటానికి ఎందుకు భయపడుతున్నారు? ఈరోజు మాట్లాడితే రేపు వచ్చే వెసల్‌కు ఇబ్బంది వస్తుందన్న భయమా? బెర్త్ ఆలస్యమవుతుందా? అప్రూవల్ ఆగుతుందా? యాంకరేజ్‌కు పంపిస్తారన్న భయమా? అందుకే ఏజెంట్ల నుంచి కాన్ఫిడెన్షియల్ స్టేట్‌మెంట్స్ తీసుకుంటే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.

**విజిలెన్స్ ఉందా... ఉన్నా ఉపయోగం లేదా? :** పోర్టులో విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ ఉంది. కానీ--- ఫోన్ చేస్తే స్పందన ఉందా? మెయిల్ చేస్తే రిప్లై వస్తుందా? కంప్లైంట్ ఇస్తే అక్నాలెడ్జ్‌మెంట్ వస్తుందా? కంప్లైంట్‌పై యాక్షన్ తీసు కుంటున్నారా? లేక విజిలెన్స్ పేరు బోర్డుకే పరిమితమైందా? విజిలెన్స్ ఫోన్, మెయిల్ రెండూ పనిచేయడం లేదన్న ఆరోపణలపై పోర్టు యాజమాన్యం వెంటనే స్పందించాలి.

**గతంలో సీబీఐ రైడ్ జరిగినా మార్పు లేదా? :** 'అమ్మ'పై గతంలో సీబీఐ రైడ్ జరిగిందన్న ప్రచారం కూడా పోర్టు వర్గాల్లో వినిపిస్తోంది. ఇది నిజమా? నిజమైతే- ఏ కేసు? ఏ సంవత్సరం? ఏ ఆరోపణ? ఏం స్వాధీనం చేసుకున్నారు? కేసు పరిస్థితి ఏమిటి? డిపార్ట్‌మెంటల్ యాక్షన్ జరిగిందా? తిరిగి కీలకమైన కమర్షియల్ పోస్టింగ్ ఎలా వచ్చింది? సీబీఐ రైడ్ జరిగిందన్న సమాచారం నిజమైతే పూర్తి రికార్డు ప్రజల ముందుకు రావాలి.

**అసలు నిజం తేలాలంటే ఈ రికార్డులు చాలు :** బెర్తింగ్ ప్రోగ్రామ్, వెసల్ అరైవల్ రికార్డు, బెర్త్ అలాట్మెంట్ వివరాలు ,వెసల్ పర్ఫార్మెన్స్ రిపోర్టులు , కార్గో హ్యాండ్లింగ్ రికార్డులు , యాంకరేజ్ షిఫ్టింగ్ ఆర్డర్లు, ఏజెంట్ కమ్యూనికేషన్ , ఫైల్ మూవ్‌మెంట్, అప్రూవల్ టైమింగ్స్ , విజిటర్ రిజిస్టర్, సీసీటీవీ ఫుటేజ్, విజిలెన్స్ కంప్లైంట్ రిజిస్టర్, ఇవి ఓపెన్ చేస్తే- ఎవరు నిజం చెబుతున్నారు? ఎవరు అబద్ధం చెబుతున్నారు? ఎవరి వెనుక ఎవరు ఉన్నారు? అన్నది బయటపడుతుంది.

**చివరికి ఒకటే ప్రశ్న... :** కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌లో రూల్స్ నడుస్తున్నాయా? లేక 'అమ్మ' రూల్ నడుస్తోందా? బెర్త్‌కు రేటు ఉందా? యాంకరేజ్‌ను బెదిరింపుగా వాడుతున్నారా? ఏజెంట్ల నుంచి వసూళ్లు జరుగుతున్నాయా? పైవారి పేర్లు ఎందుకు వినిపిస్తున్నాయి? సీనియర్ అధికారులకు అసలు విషయం తెలుసా? విజిలెన్స్ ఎందుకు స్పందించడం లేదు? ఈ ప్రశ్నలకు పోర్టు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిందే.

**ఎపిసోడ్--3లో...**

'అమ్మ' వెనుక ఉన్నది ఎవరు? బెర్త్ నుంచి యాంకరేజ్‌కు వెళ్లిన వెసల్స్ కథేంటి? ఏజెంట్ల వద్ద ఉన్న ఆధారాలేంటి? 'గ్రీన్ ఎనర్జీ' ఫైల్‌లో ఎవరి సంతకాలు? పైవారి వాటా ఆరోపణ ఎక్కడికి చేరుతుంది? విజిలెన్స్ రికార్డులు ఏం చెబుతున్నాయి? అమ్మ గారి మరిన్ని బాగోతాలు పెన్ పవర్ పాఠకులకోసం ... వచ్చే సంచికలో ..

# ఏపీలో 'తల్లికి వందనం'.. రెండో విడతకు రంగం సిద్ధం

- మొదటి పేజి తరువాయి

వెంటనే నిధులను విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విడతలో భాగంగా అర్హులైన సుమారు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 13,000 చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు, గతంలో సాంకేతిక కారణాలు, ఇతర మార్పుల వల్ల డబ్బులు అందని వారికి కూడా ఈ విడతలో నిధులు అందించనున్నారు.

అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌కు ఆర్థిక శాఖ కూడా ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఈ ఫైల్ సీఎంవో వద్ద తుది ఆమోదం కోసం ఉంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అనుమతి లభించిన వెంటనే, ఒకటి రెండు వారాల్లో లేదా వచ్చే వారంలోనే నిధులు జమ అయ్యే

అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయ్యిందా లేదా, ఈ-కేవైసీ పూర్తయిందా అనే వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థి, తల్లి ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వంటివి సరిగ్గా ఉంటే నిధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో జమ అవుతాయని వారు స్పష్టం చేశారు.

# 3డీ ప్రింటింగ్ తో పేదల ఇళ్లు..

## చంద్రబాబు సర్కారు వినూత్న ముందడుగు

- మొదటి పేజి తరువాయి

శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదివారం శంకుస్థాపన చేశారు.

**దేశానికే ఆదర్శం 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ**

ఈ గృహ నిర్మాణ యజ్ఞంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ. దేశంలోనే తొలిసారిగా భారీ ఎత్తున ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం బుర్రిపాలెంలో రూ. 14 కోట్ల వ్యయంతో 177 ఇళ్లను పైలట్ ప్రాజెక్టుగా నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్‌లకు అధికారులు టెక్నాలజీ గురించి వివరించారు. ఈ విధానంలో కేవలం 10 రోజుల్లోనే ఒక ఇంటి నిర్మాణం పూర్తి చేయవచ్చని, ఇది ఎంతో పటిష్టంగా ఉంటుందని తెలిపారు. ఈ ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, ఇది పేదలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో చేపడుతున్న ఈ 3డీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు.

**9 లక్షల ఇళ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పేదలకు సొంతిల్లు వారి ఆత్మగౌరవాన్ని పెంచుతుందని, ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి సాధారణ కోటా కింద 75 వేల ఇళ్లు మాత్రమే ఉండగా, తన విజ్ఞప్తి మేరకు కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోపే మరో 3 లక్షలు, వచ్చే ఏడాది ఇంకో 3 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని, మొత్తంగా 9 లక్షల ఇళ్లకు కేంద్రం సహకరిస్తోందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో స్థలాలు ఇచ్చి పేదలను మోసం చేశారని విమర్శించారు.

షైనింగ్ ఆంధ్రాగా ఏపీ: శివరాజ్‌సింగ్ చౌహాన్

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఇక "షైనింగ్ ఆంధ్రా, అడ్వాన్స్‌డ్ ఆంధ్రా, అచీవింగ్ ఆంధ్రా"గా మారబోతోందని కొనియాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న చంద్రబాబు సంకల్పం గొప్పదని ప్రశంసించారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ. 20 వేలు అందిస్తున్నారని, రాష్ట్రంలోని అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు సుఖంగా ఉండాలనే విధానంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్.. ఒక లబ్ధిదారురాలి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి, వారికి నూతన వస్త్రాలు అందించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. వేదికపై లక్ష్మీ అనే మహిళకు ఇంటి పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## జైరాం.. మీరింత తొందరపడతారని

# నేను అనుకోలేదు

- మొదటి పేజి తరువాయి

నేను అనుకోలేదు. అక్కడ ఉన్నది టీడీపీ, జనసేన కార్యకర్తలు. తమ నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో మాట్లాడాలని వారు ఉత్సాహం చూపారు. కార్యక్రమం తర్వాత బయటకు వచ్చి మాట్లాడతారని గౌరవ ముఖ్యమంత్రి వారికి చెప్పారు. అక్కడ జరిగింది అంతే" అని ఆమె తన పోస్టులో ఘాటుగా బదులిచ్చారు. ఓ చిన్న విషయాన్ని వక్రీకరించి తప్పుడు ప్రచారం చేయడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

**అసలేం జరిగిందంటే..**

ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తుండగా, సభకు హాజరైన కొందరు యువకులు తమ నాయకులను చూడాలనే ఉత్సాహంతో కేకలు వేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగజేసుకుని, కార్యక్రమం ముగిశాక నాయకులు అందరితో మాట్లాడతారని చెప్పి వారిని శాంతపరిచారు.

అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, 'మొదట ఉద్యోగాలు ఇవ్వండి' అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జతచేశారు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు. జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎవరో పెట్టిన తప్పుడు పోస్టు ఆధారంగా వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. సభలో కనిపించింది ప్రజాగ్రహం కాదని, తమ నాయకుల పట్ల ప్రజలు, కార్యకర్తలు చూపిన ఉత్సాహం అని వారు స్పష్టం చేశారు. ఈ ఘటనతో ఏపీలోని ఓ కార్యక్రమం చుట్టూ జాతీయ స్థాయిలో సోషల్ మీడియా వేదికగా రాజకీయ మాటల యుద్ధం రాజుకుంది.

# విమానాన్ని కూల్చేయాలనుకున్నా: ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం కేసులో నిందితుడైన కోపైలట్ హమామ్ అల్-హమామీ విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించానని అంగీకరించాడు. చావంటే తనకు ఏమాత్రం భయం లేదని దర్యాప్తు అధికారులతో స్పష్టం చేశాడు. ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఎఫ్ జెడ్ 1073 విమానంలో పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి, ఆ తర్వాత తన పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు హమామ్ ఒప్పుకున్నాడు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి కెప్టెన్ దృష్టి మరల్చి, విమానంలోని గొడ్డలితో దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ ఘటనపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దర్యాప్తు బృందాలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. హమామ్ యూఏఈలో జన్మించాడు. అతడి తండ్రి ఒమన్‌కు, తల్లి సిరియాకు చెందినవారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతను ఒమన్, సిరియా, మొరాకోలలో నివసించాడు. సిరియాలో ఎక్కువ కాలం నివసించినందున, అక్కడి సుదీర్ఘ అంతర్యుద్ధం సమయంలో అతను ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై (రాడికలైజ్) ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అతని సోషల్ మీడియా ఖాతాల్లో వేలకొద్దీ ఉగ్రవాద సంబంధిత పోస్టులు, సందేశాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న విషయాన్ని మాత్రం అతను ఇంకా వెల్లడించలేదు. కేసులో విచారణ కొనసాగుతోంది.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక..కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 04,**

అక్టోబర్ 5వ తేది సోమవారం గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా జిఎంసి విభాగాధిపతులతో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## 3 లక్షల ఇళ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 04,**

గృహ నిర్మాణ రంగంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టు శ్రీకారంబుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెంలో రూ.14 కోట్లతో 3డీ కాంక్రీట్ తో 117 ఇళ్ల నిర్మాణం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్మించనున్న త్రీడి ప్రింటింగ్ ఇళ్ల నిర్మాణం గురించివివరించిన సీబీఆర్ఐ అధికారులు, కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి కొలుసు పార్థసారధి, నాదెండ్ల మనోహర్, తదితరులు త్రీడీ ప్రింటింగ్ ద్వారా కేవలం 10 రోజుల్లో ఒక ఇల్లు నిర్మించవచ్చని వివరించిన అధికారులు, పైలట్‌గా చేపడుతున్న 177 ఇళ్లను 6 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపిన సీబీఆర్ఐ సిబ్బంది

## రోడ్డు ప్రమాదంలో మానవత్వం చాటిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా.బూర్ల రామాంజనేయులు





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 04,**

ఈరోజు బుర్రిపాలెంలో సీఎం చంద్రబాబు పర్యటన దృష్ట్యా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు గుంటూరు నుంచి వెళ్తుండగా నారాకోడూరు గ్రామ సమీప రోడ్డు వద్ద అటువైపు వస్తున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తిని లారీ ఢీ కొట్టడంతో ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రమాదాన్ని జరగడం చూసి వెంటనే కాన్వాయ్ ఆపి, ప్రథమ చికిత్స చేయించి,హుటాహుటిన వేరే వాహనంలో తరలించారు.ఆ వ్యక్తికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించి, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఎమ్మెల్యే రామాంజనేయులు చూపిన చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చు కలెక్టర్ యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 4 :**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను సోమవారం జిల్లా, మండల స్థాయిలో అన్ని కార్యాలయాల్లో పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. మీ కోసం వెబ్ సైట్ లోను ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. ప్రజలు నేరుగా సోమవారం నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు సమర్పించవచ్చని లేదా మీ కోసం వెబ్ సైట్ లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకొని, ఆర్జీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చని చెప్పారు

## ఈ నెల 5న ప్రజా సమస్యల పరిష్కార వేదిక జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 04,**

జిల్లా ప్రజల సమస్యలకు వేగవంతమైన, పారదర్శకమైన పరిష్కారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను అక్టోబర్ 5, సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా ఈ



వేదిక ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించే సమయంలో పేరు, పూర్తి చిరునామా, మొబైల్ నంబర్‌తో పాటు సమస్యకు సంబంధించిన సమగ్ర వివరాలను స్పష్టంగా పొందుపరచాలని కలెక్టర్ సూచించారు. సమస్యకు సంబంధించిన ఆధార పత్రాలు, ఇతర సంబంధిత డాక్యుమెంట్లను అర్జీతో పాటు జతచేయాలని తెలిపారు. ఇప్పటికే ఇదే సమస్యపై గతంలో ఫిర్యాదు చేసిన వారు తమ పాత అర్జీ రశీదు/ఫిర్యాదు రసీదును వెంట తీసుకురావాలని సూచించారు. దీనివల్ల పాత ఫిర్యాదు వివరాలను పరిశీలించి, తదుపరి చర్యలను వేగంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పరిష్కార ప్రక్రియకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌కు వ్యక్తిగతంగా హాజరై అర్జీ సమర్పించలేని ప్రజలు కూడా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న 1100 టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా తమ ఫిర్యాదులను నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అర్జీల స్వీకరణ ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు డివిజన్, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. తమ ప్రాంతానికి సమీపంలోని సంబంధిత కార్యాలయాలను ప్రజలు సంప్రదించి సమస్యలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణపై కమిషన్ సభ్యురాలి పర్యటన



**విజయవాడ , పెన్ పవర్,అక్టోబర్ 04,**

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శ్రీమతి కె.జి. పద్మలత అక్టోబర్ 06,07 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో బాలల హక్కుల చట్టాల అమలు, సంక్షేమ పథకాల తీరును పరిశీలించేందుకు ఆమె ఈ పర్యటన చేపట్టనున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి శ్రీమతి షేక్ రుక్సానా సుల్తానా బేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అక్టోబర్ 06న అంగన్‌వాడీ కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లు మరియు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలను కమిషన్ సభ్యురాలు సందర్శించి పరిశీలిస్తారు. అనంతరం ప్రభుత్వ బాలుర వసతి గృహ లను తనిఖీ చేస్తారు.అక్టోబర్ 07న సంరక్షణ కేంద్రాల సిబ్బందితో బాలల హక్కులు, అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమలపై సమీక్షా నిర్వహిస్తారు. తరువాత కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శిస్తారు. అక్కడ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారు.

కమిషన్ సభ్యురాలి పర్యటనలో ఎలాంటి సమన్వయ లోపాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం సంబంధిత అధికారులను ఆదేశించింది. కేటాయించిన విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## గార్మీ వేడుకల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 04,**

పశ్చిమ నియోజకవర్గంలోని 23వ డివిజన్ గొర్రెలదొడ్డి ప్రాంతంలో గార్మీ పండుగ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా అన్నదానం చేశారు. అనంతరం ముస్లిం సోదర సోదరీమణులతో కలిసి ప్రత్యేక దువాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మత సామరస్యం, సోదరభావానికి గ్యార్మీ లాంటి పండుగలు ప్రతీకగా నిలుస్తాయని, అన్ని వర్గాల ప్రజలు శాంతి, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్ అభియాన్‌లో ఉచిత వైద్య శిబిరం బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్,



**గుంటూరు:పెన్ పవర్, అక్టోబర్, 04,**

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఆదివారం గుంటూరు బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బీజేపీ మూడో మండల అధ్యక్షురాలు గాయత్రి బెహరా ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూపూడి రంగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా జూపూడి రంగరాజు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, జ్వరం, దగ్గు, జలుబు తదితర ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు దంత వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, ఈసీజీ సేవలను ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు. గాయత్రి బెహరా ఆధ్వర్యంలో శిబిరాన్ని చక్కగా నిర్వహించారని, వైద్యులు డాక్టర్ సీహెచ్ స్రవంతి, ఎండీ జనరల్ మెడిసిన్ డాక్టర్ రేవూరి హరికృష్ణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారని అభినందించారు.ఈ కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరి వెంకట సుబ్బారావు, బీజేపీ సీనియర్ నాయకులు నేరెళ్ల మాధవరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, జగన్మోహన్ ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలపాటి రవికుమార్, మండల ప్రధాన కార్యదర్శులు జంధ్యాల పవన్ కుమార్, యశ్వంత్ లకారా, మండల కార్యదర్శి అన్న బాలురంగయ్య, జి.వి.ఎస్. ప్రసాద్, యువమోర్చా అధ్యక్షుడు కుప్ప యశ్వంత్, జిల్లా సీనియర్ నాయకులు భూసి స్టాలిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణంతో ప్రాంతాల రూపురేఖలు మారుస్తాం --- ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**పెన్ పవర్, కృష్ణాజిల్లాపెనమలూరు, అక్టోబర్ 04**

యనమలకుదురు, తాడిగడప, పోరంకి, కానూరులో నూతన రోడ్లకు శంకుస్థాపనతాడిగడప మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల నిర్మాణంతో ప్రాంతాల రూపురేఖలను మార్చడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. యనమలకుదురు, తాడిగడప, పోరంకి, కానూరు ప్రాంతాల్లో నూతన రోడ్ల నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎన్నో ఏళ్లుగా రోడ్ల కోసం ఎదురుచూస్తున్న తమ ప్రాంతాల్లో పనులకు శ్రీకారం చుట్టడంపై కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో హెచ్ఏఎం పథకం కింద రూ.51 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఒక్క యనమలకుదురు పరిధిలోనే రూ.7.50 కోట్లతో 23 రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

అత్యధిక జనాభా కలిగిన యనమలకుదురులో సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన పైపులైన్లు పూడుకుపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. రూ.150 కోట్లతో పాత పైపులైన్లు, నీటి ట్యాంకులను తొలగించి, వాటి స్థానంలో కృష్ణానది నుంచి నేరుగా మంచినీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేశామని, త్వరలోనే పనులకు



టెండర్లు ఖరారు చేస్తామని వెల్లడించారు.

యనమలకుదురు ప్రధాన ట్యాంకుతో పాటు కొండపై ఉన్న ట్యాంకుకు కృష్ణానది నుంచి నీటి అనుసంధానం చేసేందుకు రూ.1.25 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు ఇప్పటికే వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో మురుగునీటి కాలువల నిర్మాణానికి అదనంగా మరో రూ.51 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. అధిక జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో ఈ నిధులను వినియోగిస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మట్టి రోడ్లన్నింటినీ ఈ పథకం ద్వారా సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

2014--19 మధ్యకాలంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో యనమలకుదురులో 80 రోడ్లు నిర్మించినట్లు బోడె ప్రసాద్ గుర్తుచేశారు. ఇప్పటికే 90 శాతం పూర్తయిన యనమలకుదురు వంతెనను కూటమి ప్రభుత్వం హయాంలో తానే ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం పూర్తిచేసి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల సహకారంతో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల సహకారంతో తాడిగడప మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో క్లస్టర్--3 ఇన్‌చార్జి అనంతనేని ఆజాద్, తాడిగడప మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకర్‌రావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ తాతపూడి గణేష్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ సొంటి శివరామకృష్ణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ గీత గోపీచంద్, దుర్గామల్లేశ్వరస్వామి బోర్డు సభ్యుడు వెలగపూడి శంకర్‌బాబు, బీసీ నాయకులు సంగేపు రంగారావు, తుమ్మల రామ్‌కుమార్, అధికారులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిలకలూరిపేటలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన మరియు తనిఖీలు.




**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 04 :**
పట్టణంలోని రద్దీ ప్రాంతమైన అడ్డరోడ్డు సెంటర్ వద్ద సీఐ రమేష్ ఆదేశాల మేరకుట్రాఫిక్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ నేపథ్యంలో ఎస్సై హాజరత్తయ్య ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టడం జరిగింది.ఈ తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని వారికి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ట్రాఫిక్ చలానాలు విధించారు. అదేవిధంగా ప్రయాణ సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని,సీటు బెల్టు పెట్టుకోవాలని మరియు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రాణ రక్షణకు ఎంత ముఖ్యమో యువతకు, వాహనదారులకు ఎస్సై హాజరత్తయ్య అవగాహన కల్పించారు.రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష



**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 4,**
గుంటూరు జిల్లా తెనాలి బుర్రిపాలెం నందు పేదలకు ఇళ్ల పట్టాభిషేకం కార్యక్రమంలో పీఎం ఈవై గ్రామీణ్ 2.0 క్రింద మూడు లక్షల నిర్మాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని, కేంద్ర మంత్రివర్యులు శివరాజ్ చౌహాన్ గారిని హెలిపాడ్ వద్ద రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ జనాబ్ షేక్ హసన్ భాష మర్యాదపూర్వకంగా కలిసి శాలువ తో సన్మానించి పుష్ప గుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు గారు హసన్ భాషను కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్ కు పరిచయం చేశారు.అనంతరం సమావేశంలో కూటమి నాయకులతో కలిసి సమావేశంలో హసన్ భాషా పాల్గొన్నారు.

## ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా రూరల్ సీఐ సుబ్బ నాయుడు

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, అక్టోబర్ 04 :**
నాదెండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గణపవరం జాతీయ రహదారిపై ప్రయాణికుల ప్రాణ రక్షణే ధ్యేయంగా రూరల్ సీఐ సుబ్బ నాయుడు తన మానవీయ దృక్పథాన్ని చాటుకున్నారు. అర్ధరాత్రి వేళ కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా, వాహనదారులు క్షేమంగా గమ్యస్థానాలకు చేరాలన్న ఉన్నత సంకల్పంతో ఆయన స్వయంగా రంగంలోకి దిగారు. ఎస్సై వెంకటేశ్వరరావుతో కలిసి రాత్రి వేళల్లో అతివేగం, నిద్రమత్తు వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు రహదారిపై రేడియం స్టిక్కర్లు అతికించిన డ్రమ్ములను ఏర్పాటు చేశారు. ప్రయాణికులను తన సొంత కుటుంబ సభ్యుల్లా భావిస్తూ, రాత్రి సమయాల్లో సైతం రోడ్డుపైనే ఉండి భద్రతా ఏర్పాట్లను



పర్యవేక్షిస్తున్న సీఐ సుబ్బ నాయుడు అంకితభావాన్ని స్థానికులు, ప్రయాణికులు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయానికి సీఎం చంద్రబాబు ప్రోత్సాహంఅభినందనీయం





**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 04,**
ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు తెనాలి పర్యటనకు వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుర్రిపాలెంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన రైతు జానకీరామ్ ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుమందులు ఉపయోగించకుండా సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న రైతు జానకీరామ్‌ను కేంద్ర మంత్రి భుజం తట్టి అభినందించారు.

ఈ సందర్భంగా రైతు సాగు విధానాలు, పెట్టుబడి ఖర్చులు, దిగుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎకరా వరి సాగుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కేవలం రూ.7 వేలు మాత్రమే ఖర్చవుతోందని, రసాయన ఎరువులతో సాగు చేస్తే సుమారు రూ.25 వేల వరకు వ్యయం అవుతోందని రైతు వివరించారు.

అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని, 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలనేలక్ష్యంతో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. బీజామృతం, జీవామృతం వంటి సహజ పద్ధతులతో సాగు చేయడం ద్వారా భూసారం పెరగడంతో పాటు ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహంతో రాష్ట్రం ఈ రంగంలో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉందని ప్రశంసించారు.ప్రధానినరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. సాగు ఖర్చులు తగ్గడంతో రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోందని తెలిపారు.

అంతకుముందు బుర్రిపాలెంలో సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు.

## స్వచ్ఛ అంగన్వాడిగా పద్మకు కలెక్టర్ అవార్డు




**వేటపాలెం, అక్టోబరు 4 (పెన్ పవర్):**
స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పందిళ్లపల్లి--1 అంగన్వాడీ కేంద్రం కార్యకర్త పుప్పాల పద్మ 'స్వచ్ఛ అంగన్వాడి' గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పరిశుభ్రత ప్రమాణాలను క్రమం తప్పకుండా పాటించినందుకు పద్మను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ, సూపర్‌వైజర్ సజ్జా పుష్పవల్లి తదితర అధికారులు పాల్గొన్నారు. పద్మకు అవార్డు లభించడం పట్ల సీడీపీవో టి. ఝాన్సీ అభినందనలు తెలిపారు.

## గుడిసెనుంచిగృహానికి..అద్దెనుంచిఆస్తికి..అభద్రతనుంచి ఆత్మగౌరవానికి -- కేంద్ర మంత్రి పెమ్మసాని






**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 04,**
రాష్ట్రంలోని పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ముందడుగు వేశాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తెనాలి మండలం బుర్రిపాలెంలో ఆదివారం నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పాల్గొని రాష్ట్రంలో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. రాష్ట్రానికి సుమారు 75 వేల ఇళ్లు మాత్రమే వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో కేంద్రంతో సమన్వయం చేసుకుని 3 లక్షల ఇళ్లను సాధించామని వెల్లడించారు. ఒక్కో లబ్ధిదారుడికి వివిధ ప్రభుత్వ పథకాలు, స్వయం సహాయక సంఘాల రుణాల ద్వారా సుమారు రూ.2.30 లక్షల వరకు ఆర్థిక సహాయం అందే అవకాశం ఉందన్నారు.గ్రామీణ గృహ నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టే లక్ష్యంతో బుర్రిపాలెంలో 100, ఓబులనాయుడుపాలెంలో దివ్యాంగుల కోసం 70 ఇళ్లతో 3డీ హౌసింగ్ పైలట్ ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సాంకేతికత విజయవంతమైతేతక్కువఖర్చుతో, తక్కువ సమయంలో ఇళ్ల నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

రానున్న రెండు, మూడు సంవత్సరాల్లో అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, గతంలోనిలిచిపోయినటిడ్కోఇళ్లనుకూడా లబ్ధిదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదలకు పేదరికాన్ని కాకుండా ఆస్తిని వారసత్వంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గుడిసె నుంచి గృహానికి.. అద్దె నుంచి ఆస్తికి.. అభద్రత నుంచి ఆత్మగౌరవానికి"లిలి అనే లక్ష్యంతో ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భరోసా కల్పిస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీ భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విదేశీయుల బస వివరాలు తప్పనిసరిగా నమోదు
## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్పీ ఉమామహేశ్వర్



**బాపట్ల, అక్టోబరు 4 (పెన్ పవర్):**
జిల్లాకు విద్య, వైద్యం, పర్యటన, వ్యాపారం తదితర అవసరాల కోసం వచ్చే విదేశీయులకు వసతి కల్పించే హోటళ్లు, రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లు, అద్దె ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రులు, హాస్టళ్లు, ఆశ్రమాలు, విద్యాసంస్థల నిర్వాహకులు వారి బస వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ సూచించారు.

విదేశీయుల రాక, బస, నిష్క్రమణకు సంబంధించిన పూర్తి వివరాలను నిబంధనల ప్రకారం 24 గంటల్లోగా ఫారం-సిలో నమోదు చేయాలని తెలిపారు. బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వివరాలను అప్‌లోడ్ చేసి సంబంధిత ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ/ఎఫ్‌ఆర్‌ఓ కార్యాలయాలకు అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.విదేశీయుల బస వివరాల నమోదులో నిర్లక్ష్యం వహించినా, నిబంధనలు ఉల్లంఘించినా సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. నిబంధనల మేరకు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు జరిమానా, రెండేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు.

విదేశీయులు చెల్లుబాటయ్యే పాస్‌పోర్టు, వీసా కలిగి ఉండటంతోపాటు భారతీయ చట్టాలను గౌరవించాలని సూచించారు. ఓసీఐ కార్డుదారులు భారతదేశంలో ఎన్నికల్లో పోటీ చేయడం, ఓటు వేయడం, వ్యవసాయ భూములు కొనుగోలు చేయడం వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. తమ పరిసరాల్లో విదేశీయులు నివసిస్తున్నట్లయితే వారి సమాచారాన్ని టెలిఫోన్ లేదా ఈ-మెయిల్ ద్వారా పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు ఎస్పీ సూచించారు. విదేశీయులకు వసతి కల్పించే ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

## ఆబాద్‌నగర్‌లో ఘనంగా గ్యార్వి షరీఫ్ వేడుకలు





**వేటపాలెం, అక్టోబర్ 4 (పెన్ పవర్):**
హజరత్ మహెబూబె సుబహాని, ఖంధిలె నూరాని, పిరానే పీర్ షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని సర్కార్ వారి గ్యార్వి షరీఫ్ పండుగను బాపట్ల జిల్లా వేటపాలెం మండలంలోనిఆబాద్‌నగర్‌లోమాబుసుబాని వారియర్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన గ్యార్వి కార్యక్రమంలో భాగంగా లంగర్ (అన్న సమారాధన)ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

ముఖ్య అతిథిగా గులామె మష్కుర్ యూసుఫ్ సుబాని అల్ మష్కురి పాల్గొని సలాం ఫాతెహా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక దువా చేశారు. కార్యక్రమంలో మొగల్ అన్వర్ బేగ్, షఫీ రహమతుల్లా, ఫకర్ హమద్, మౌలానా బేగ్, జిలాని బేగ్, బాబు, రఫీ ఖాన్, వేటపాలెం మండల మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ మాబు ఖాదర్ ఖాన్, బాజీ ఖాన్ ఖాదర్, రసూల్ ఖాన్, ఖాజా ఆరిఫ్, జునైద్ మష్కురి తదితరులు పాల్గొన్నారు.గ్యార్వి షరీఫ్ వేడుకల్లో కులమతాలకు అతీతంగా హిందూ, ముస్లిం సోదరులు పాల్గొని మతసామరస్యాన్ని చాటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కార్డన్ సెర్చ్
## విజిలిపేటలో 38 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు గుర్తింపు







**చీరాల, అక్టోబరు 4 (పెన్ పవర్):**
అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా చీరాల ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజిలిపేటలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు డీఎస్పీ మొహమ్మద్ మోహిన్ సూచనలతో చేపట్టిన ఈ తనిఖీల్లో ఒకటో పట్టణ సీఐ సోమశేఖర్, రెండో పట్టణ సీఐ శశికుమార్, ఆరుగురు ఎస్సైలు, 65 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 38 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను పోలీసులు గుర్తించారు. వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ, బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు ఉన్న వాహన యజమానులు వాటిని చూపించి వాహనాలను తీసుకెళ్లవచ్చని, పత్రాలు లేని వాహనాలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. వాహనాలకు బీమా, పీయూసీ ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే కార్డన్ సెర్చ్ ప్రధాన ఉద్దేశమని ఒకటో పట్టణ సీఐ సోమశేఖర్ తెలిపారు. గంజాయి, నాటుసారా, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. అనుమానాస్పద లేదా అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'శిరోరక్ష--ప్రాణరక్ష' కార్యక్రమంలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని పోలీసులు సూచించారు.

## జైసల్మేర్‌లో రెండు మగ గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షుల విడుదల

### దశాబ్ద కాలంగా శాస్త్రవేత్తలు, పరిశోధకులు చేసిన కృషికి మైలురాయి: భూపేందర్ యాదవ్

**ఢిల్లీ, అక్టోబరు 4 (పెన్ పవర్):**

తీవ్ర అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ (బట్టమేక పక్షి) సంరక్షణలో కీలక ముందడుగు పడింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ఆదివారం రాజస్థాన్‌లోని జైసల్మేర్ ఎడారి జాతీయ ఉద్యానవనం పరిధిలోని సామ్ ప్రాంతంలో రెండు మగ గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షులను సహజ ఆవాసంలోకి విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో రాజస్థాన్ అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సంజయ్ శర్మతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ, దాదాపు దశాబ్ద కాలంగా శాస్త్రవేత్తలు, పరిశోధకులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరంగా చేసిన కృషికి ఇది మైలురాయి వంటి ఫలితమని పేర్కొన్నారు.గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌తోపాటు ఇతర జీవజాతుల



సంరక్షణకు శాస్త్రీయ సమాజం కృషి చేసేలా నిరంతరం మార్గనిర్దేశం, ప్రోత్సాహం, సహకారం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళల టీమ్ గోల్ఫ్‌లో భారత్‌కు రజతం

### అదితి అశోక్, ప్రణవి శరత్ ఉర్స్, దీక్షా డాగర్‌కు ప్రధాని అభినందనలు

**ఢిల్లీ, అక్టోబరు 4 (పెన్ పవర్):**

ఆసియా క్రీడలు--2026 మహిళల టీమ్ గోల్ఫ్ పోటీలో రజత పతకం సాధించిన భారత క్రీడాకారిణులు అదితి అశోక్, ప్రణవి శరత్ ఉర్స్, దీక్షా డాగర్‌లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు.వీరి విజయం క్రీడ పట్ల వారికున్న దృఢ సంకల్పం, అంకితభావానికి నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ విజయపథంలో కొనసాగుతూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

"ఆసియా క్రీడలు--2026 మహిళల టీమ్ గోల్ఫ్ విభాగంలో రజత పతకం సాధించిన అదితి అశోక్, ప్రణవి శరత్ ఉర్స్, దీక్షా డాగర్‌లకు అభినందనలు. వారి దృఢ సంకల్పం, క్రీడపై ఉన్న మక్కువను ఈ విజయం చాటుతోంది. రాబోయే రోజుల్లో వారు మరిన్ని విజయాలను సాధించాలి" అని ప్రధానమంత్రి కార్యాలయం 'ఎక్స్' వేదికగా పేర్కొంది.

## మెట్టిగూడ జనరల్ సెక్రెటరీ రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో

### రెండో ఫేస్ సార్ న్యూ ఓటర్లు ఫామ్ 6 డిస్ట్రిబ్యూషన్

**అక్టోబరు 4 (పెన్ పవర్):**

**సికింద్రాబాద్అక్టోబర్:4/102026**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి -- సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ శ్రీ ర్యాల రాజేందర్ యాదవ్ ఈరోజు రెండో ఫేస్ కార్యక్రమం లో భాగంగా మెట్టుగూడ కాంగ్రెస్ పార్టీ హెల్ప్ డిస్క్ ఎరుపాటు చేసి ఓటర్లు కి ఫార్మ్ 6 పంపిన చేసారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ డివిజన్ నాయకులు మహిళా నాయకురాలు రూప రూత్ క్లారి, కస్తూరి, సంతోషి , సుజాత




## మళ్ళీ మోదీయే గెలుస్తారని, ఇండియా కూటమికి భయం

### అక్కడ రాహుల్, ఇక్కడ రేవంత్ రెడ్డి వస్తారనేది భ్రమ



**హైదరాబాద్, అక్టోబరు 4 (పెన్ పవర్):**

దేశ ప్రధానిగా మళ్లీ నరేంద్ర మోదీ నాలుగవసారి పదవిలోకి వస్తారనే భయం ఇండియా కూటమిని పట్టిపీడిస్తోందని, ఏపీ బీజేపీ నేత, ఉమ్మడి ఏపీ మున్సిపల్ కౌన్సిల్ మాజీ ఛైర్మన్ గొరకపూడి చిన్నయ్య దొర అన్నారు. అందుకే, ఎలక్షన్ కమిషన్ పై లేనిపోని అపోహలు కల్పించి ఉద్యమాలంటూ యాగీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం లక్డీకాపూల్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు లో విలేకరుల సమావేశంలో చిన్నయ్య దొర మాట్లాడుతూ, ఈసీని , ఈవీఎంలను బీజేపీ మేనేజ్ చేసి ఉంటే, విపక్షాలకు వివిధ రాష్ట్రాలలో అన్ని సీట్లు, ఓట్లు దక్కేవి కావన్నారు. తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చేది కాదని, కర్ణాటకలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులు వచ్చేవారా అని చిన్నయ దొర ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా బలహీన నాయకత్వంతో బాధపడుతోందని వాపోయారు. సాధారణ ఎన్నికలలో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలో వస్తుందని చిన్నయ్యదొర ధీమా వ్యక్తం చేశారు. 10 ఏళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ మీద, మూడేళ్ల

పరిపాలించిన కాంగ్రెస్ మీద కూడా ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. తెలంగాణ రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్లో జగన్ మోహన్ రెడ్డి, మళ్ళీ అధికారంలోకి వస్తారనుకోవడం భ్రమ అని, ఇద్దరూ పగటి కలలతో, అధికారం సొంతం అనుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. భారత దేశానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన నాయకుడు మోదీ మళ్లీ నాలుగో సారి అధికారంలోకి రావాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని చిన్నయ్య దొర చెప్పారు.

## గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్**

**హైదరాబాద్, అక్టోబరు 4 (పెన్ పవర్):**

అర్హులైన గీత కార్మికులకు లైసెన్సులు, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సొసైటీలు రెన్యూవల్ కాలేదన్న సాకుతో పెన్షన్ అర్హుల దరఖాస్తును తిరస్కరించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్ బహద్దూర్‌లో గౌర్ తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమం, వృత్తి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. సొసైటీలకు లైసెన్సుల కోసం రూ.1,000 కోట్ల నిధి కేటాయించాలని, గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిలుగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గీత ఉత్పత్తిదారుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కో- ఆర్డినేటింగ్ సెక్రటరీ బొమ్మగాని నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను రూ.10లక్షలు, పెన్షన్ రూ.5వేలకు పెంచాలని కోరారు. కల్లు దుకాణాల సెక్యూరిటీ డిపాజిట్లు, కాంపౌండింగ్ ఫీజులు రద్దు చేయాలని, గీత కార్మికుల ప్రమాద బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా తాటి, ఈత వానల పెంపుకు 10 ఎకరాల చొప్పున భూమి కేటాయించాలని, కార్మికులకు సేఫ్టీ కిట్లు అందించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో వృత్తి నిర్వహిస్తున్న గీత కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాడంతో పాటు ఈనెల 19.20 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం 70 వార్షికోత్సవాల సందర్భంగా జెండాను ఆవిష్కరించాలని సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవిఎల్, మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్, దూసరి శ్రీరాములు, చింతపల్లి పుల్లయ్య, తప్పెట్ల రాములు, బందం నాగేశ్వరరావు, బి.తిరుపతిగౌడ్, జె.ఆనంద్‌గౌడ్, మల్లని సుధాకర్‌గౌడ్, కనుకమామిడి శ్రీశైలంగౌడ్, జె.నాగార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల హక్కులకు భంగం కలిగించే విధంగా ఎన్నికల కమిషన్ విధానాలు ఉన్నాయని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అసహనం వ్యక్తం చేశారు.

**హైద్రాబాద్, అక్టోబరు 4 (పెన్ పవర్):**

ఓటర్ల హక్కులకు భంగం కలిగించే విధంగా ఎన్నికల కమిషన్ విధానాలు ఉన్నాయని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పద్మారావు నగర్ లోని బెల్వర్డి గార్డెన్ అపార్ట్మెంట్ లో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఓటరు నమోదు ఎందుకని ప్రశ్నించారు. నూతన గ్రాడ్యుయేట్ లను మాత్రమే ఓటరు గా నమోదు చేసుకునే విధానాన్ని అమలు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా, ఆ విధంగా జరగడం లేదని అన్నారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో కూడా టెక్నాలజీ, కార్యక్రమంపై ఎలాంటి అవగాహన లేని వారిని బి ఎల్ ఓ లు గా నియమించడం వలన గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. దీని వలన లక్షలాది మంది ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించబడ్డాయని తెలిపారు. తిరిగి పేర్లు తొలగించబడ్డ ఓటర్లకు ఎన్నికల కమిషన్ నోటీసులు ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ పై లేదా అని ప్రశ్నించారు. పెద్ద వ్యవస్థ కలిగిన కేంద్ర, రాష్ట్ర



ప్రభుత్వాల సహకారాన్ని ఎన్నికల కమిషన్ ఎందుకు తీసుకోవడం లేదన్నారు. త్వరలో గ్రాడ్యుయేట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్ లు ఓటరు గా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మీ ప్రాంతంలో, మీకు పరిచయమున్న గ్రాడ్యుయేట్ లు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని కోరారు. ఓటు ఎవరికి వేయాలి అనేది అది మీ నిర్ణయంపై ఆధారపడి ఉందని, కానీ ముందు ఓటరుగా నమోదు కావాలని కోరారు. రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి అవేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రధానంగా విద్యుత్, త్రాగునీటి సమస్య నెలకొందని అన్నారు. మున్సిపల్, హోం, విద్యాశాఖ మూడు కూడా ముఖ్యమంత్రి తన వద్దే పెట్టుకొని వాటిపై ఇప్పటి వరకు పర్యవేక్షణ చేసిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. హార్వర్డ్ యూనివర్సిటీ లో చదువుకున్న అని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి మాట్లాడే భాష అందుకు




భిన్నంగా ఉందని, ప్రజలు అందరు గమనిస్తున్నారని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో త్రాగునీరు, విద్యుత్ వంటి సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ చేసి అవసరమైన చర్యలు తీసుకునే వారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రాడ్యుయేట్ లు తమ వివరాలు నమోదు చేసిన ఓటరు నమోదు పత్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు అందజేశారు. కార్యక్రమంలో పద్మారావు నగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, అపార్ట్మెంట్ వాసులు మిట్టపల్లి జగ్గయ్య, రాజశేఖర్, ముకుంద్, సత్యనారాయణ, ఆనంద్, ప్రసాద్, పవన్,మామిడి బాల్ రెడ్డి, డాక్టర్ ఇందిర, బిఆర్ఎస్ పార్టీ బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, వెంకటరమణ, శ్రీకాంత్‌రెడ్డి,లంబుశ్రీను,మిట్టపల్లిబాబూరావు,సాయిరాం చారి,హరిచారి, కొత్తూరు వెంకట్, ఎం ఎన్ శ్రీనివాస్, కృష్ణముదిరాజ్,నేరెటి రవి,శైలేందర్,అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఐఏలో ముగిసిన 'స్వచ్ఛతా హీ సేవ--2026'

### అక్టోబర్ 31 వరకు ప్రత్యేక ప్రచారం 6.0 కొనసాగింపు

**ఢిల్లీ, అక్టోబరు 4 (పెన్ పవర్):**

న్యూఢిల్లీలోని అఖిల భారత ఆయుర్వేద సంస్థ (ఏఐఐఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవ--2026'ప్రచారం అక్టోబర్ 2న ముగిసింది. ఏఐఐఏస్వస్థవృత్త--యోగా విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'స్వచ్ఛతలో భాగస్వామ్యం--స్వచ్ఛ భారత్, వికసిత భారత్' నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.పరిశుభ్రత, బాధ్యతాయుత వ్యర్థాల నిర్వహణ, పర్యావరణంపై అవగాహన, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా సంస్థ ప్రాంగణంతోపాటు పరిసర ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు చేపట్టారు. ముగింపు కార్యక్రమంలో ఏఐఐఏ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) పి.కె. ప్రజాపతి, డీయూ డీన్ ప్రొఫెసర్ (డాక్టర్) మంజూషా రాజగోపాల, రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ (డాక్టర్) రాజగోపాల, ఏఎంఎస్ డాక్టర్ రాజారామ్ మహతోతోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సంస్థ ప్రాంగణమంతా పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి ఉమ్మడి బాధ్యత అని డైరెక్టర్



పి.కె. ప్రజాపతి పేర్కొన్నారు. స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలోభాగంగాచేసుకోవాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు, పరిశోధకులు, సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. సంస్థ పరిశుభ్రతకు నిరంతరం సేవలందిస్తున్న సఫాయి మిత్రులను ఘనంగా సత్కరించారు.'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా ఎన్‌టీపీసీ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మంజూషా రాజగోపాల, ప్రొఫెసర్ మహేశ్ వ్యాస్, ప్రొఫెసర్ రాజగోపాల, డాక్టర్ రాజారామ్ మహతోతోపాటు సీనియర్ అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

పక్షం రోజులపాటు జరిగిన ప్రచారంలో అధ్యాపకులు, పీహెచ్‌డీ, పీజీ పరిశోధకులు, సిబ్బంది, రోగులు, వారి సహాయకులు భాగస్వాములయ్యారు. నాలుగు విధాల వ్యర్థాల విభజన, ఇంటి వద్ద కంపోస్టు తయారీ, తగ్గించడం--పునర్వినియోగం--రీసైక్లింగ్ (3ఆర్‌లు), ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. శ్రమదానంలో భాగంగా కార్యాలయాలు, సంస్థలోని వివిధ ప్రాంతాలను శుభ్రపరిచారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సమర్థంగా సేకరించడం, వేరు చేయడం, సురక్షితంగా పారవేయడం అనే అంశంతో చేపట్టిన 'ప్రత్యేక ప్రచారం 6.0'ను అక్టోబర్ 31 వరకు కొనసాగించనున్నట్లు ఏఐఐఏ వెల్లడించింది.

## బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### -టీపీసీసీ ఓబీసీ బహిరంగ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,అక్టోబరు 4 (పెన్ పవర్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినాయకత్వంలో తెలంగాణప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచేలా కులగణన నిర్వహించిందన్నారు. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వామ్యం చేసి సమగ్రంగా కులగణన నిర్వహించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. బీహార్‌తోపాటు తెలంగాణ కూడా కులగణన నిర్వహించిన రాష్ట్రంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. కులగణన కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం కాదు.. దేశంలోని బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల హక్కులకు సంబంధించిన అంశం అని మంత్రి చెప్పారు. దేశవ్యాప్తంగా కులగణన జరగాలి.. ఇదే మా ప్రధాన డిమాండ్ అని మంత్రి స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు కులగణనకోసంప్రజాఉద్యమాన్నినిర్మించాలన్నారు. సమావేశాలు,ప్రజాసభలు,రౌండ్‌టేబుల్‌సమావేశాలు, ప్రెస్ కాన్ఫరెన్సుల ద్వారా కులగణన ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. అన్ని బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలు ఐక్యంగా నిలబడి సామాజిక న్యాయం కోసం పోరాడాలన్నారు. తెలంగాణ ఉద్యమం, స్వాతంత్ర్య పోరాటం, నిజాం వ్యతిరేక పోరాటాల్లో ప్రజల ఐక్యతే విజయానికి కారణమైందని మంత్రి పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఐక్యంగా పోరాడాలన్నారు.

అనేక వెనుకబడిన వర్గాలకు ఇప్పటికీ తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కడం లేదన్నారు. గ్రామపంచాయతీ స్థాయి నుంచి శాసనసభ, పార్లమెంట్ వరకు అన్ని స్థాయిల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. తెలంగాణలో కులగణన ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభ తీర్మానం చేసిందని మంత్రి తెలిపారు. కేబినెట్ నిర్ణయం తీసుకుని ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న 50 శాతం రిజర్వేషన్ పరిమితి వంటి అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని, రిజర్వేషన్ల విషయంలో ప్రామాణికమైన గణాంకాలు అత్యంత కీలకం అని మంత్రి అన్నారు.

ప్రామాణికమైన గణాంకాల కోసం దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించాలని,

ప్రతి సామాజిక వర్గం జనాభా, సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు రావాలన్నారు. కులగణన ఆధారంగా సంక్షేమ పథకాలు,రిజర్వేషన్లు,రాజకీయప్రాతినిధ్యం నిర్ణయించే అవకాశం ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన అధికారాలను వినియోగించి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ శాసనసభలో చేసిన తీర్మానాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. గ్రామసభల్లో కులగణనకు అనుకూలంగా తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

కులగణన కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో జరుగుతున్న పోరాటానికి తెలంగాణ సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు . కులగణన – సామాజిక న్యాయానికి పునాదని , అన్ని వర్గాలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు, సముచిత ప్రాతినిధ్యం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఏనుగు బీభత్సం

### మావటికి తీవ్రగాయాలు

**తిరుపతి,అక్టోబరు 4 (పెన్ పవర్):**

తిరుచానూరుశ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో టీటీడీకిసంబంధిచినఏనుగులభీభత్సంసృష్టించడంతో మావటి చంద్రారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రతిరోజూసాయంత్రంఅమ్మవారి వాహన మండపంలో ఉంజల్ సేవ నిర్వహిస్తారు. ఆ సమయంలో టీటీడీకి సంబంధించినఏనుగులుఆలయంవద్దకుతీసుకురావడం



ఆనవాయతీ. ఊంజల్‌సేవపూర్తైనతరువాతఏనుగులను తిరిగిఉద్యానవనానికితీసుకెళతుండగాఒకఏనుగు ఒక్కసారిగామావటిని కింద వేసి తొక్కివేయడంతో అతనికి రక్త వాంతులు అయ్యాయి. దీంతో భక్తులు హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. 108 సహాయంతో గాయపడిన మావటిని ఆసుపత్రికి తరలించారు.

# శ్రీసిటీలో ఫ్యాక్టరీ ప్రమాదంపై విచారణ

**అక్టోబరు 4 (పెన్ పవర్):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి జిల్లా శ్రీసిటీలో జరిగిన ఫ్యాక్టరీ బాయిలర్ పేలుడు దుర్ఘటనలో ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ భీకర ప్రమాద ఘటనపై అధికారులు ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. బాధ్యులపై చర్యల్లో భాగంగా యాజమాన్యం బాయిలర్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేసింది. ప్రస్తుతం పోలీసులు ప్లాంట్ హెడ్ మరియు ఆపరేటర్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మరోవైపు దర్యాప్తు బృందం కంపెనీ యాజమాన్యాన్ని కూడా ఈ ప్రమాదానికి సంబంధించి గట్టిగా ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు శ్రీసిటీలోని



అన్ని పరిశ్రమల్లోనూ సమగ్ర సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని అధికారికంగా ఆదేశాలు జారీ అయ్యాయి.

# సీఈసీ జ్ఞానేశ్... బీజేపీ కార్యకర్త: వైఎస్ షర్మిల



**అక్టోబరు 4 (పెన్ పవర్):**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బీజేపీ కార్యకర్తలా, ప్రధాని మోడీకి ఏజెంట్లా వ్యవహరిస్తున్నారని వైఎస్ షర్మిల తీవ్రంగా ఆరోపించారు.
శనివారం జ్ఞానేశ్ రాజీనామా కోరుతూ ఆమె ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.
దేశంలో 13 కోట్ల ఓట్లను తొలగించడం దుర్మార్గపు చర్య అని, జ్ఞానేశ్ రాజీనామా చేయాలి లేదా తొలగించాలని, విచారణ జరిపి అరెస్ట్ చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.
పవిత్రమైన ఓట్లను బీజేపీ చోరీ చేస్తోందని, మోడీ ఓట్ల గజదొంగ అని, ఈసీ మోడీ చెప్పుచేతుల్లో పనిచేస్తోందని ఆమె ఆరోపించారు.

# సంగీతం శ్రీనివాసరావు మృతి పట్ల వైఎస్ జగన్ సంతాపం

**అక్టోబరు 4 (పెన్ పవర్):**

ప్రధాన సారాంశం: ప్రముఖ దర్శకుడు, లెజెండరీ ఫిలింమేకర్ సంగీతం శ్రీనివాసరావు మృతి పట్ల వైయస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. తెలిపిన వివరాలు: దక్షిణ భారత సినీ రంగంలో సంగీతం శ్రీనివాసరావు తనదైన ప్రత్యేక ముద్ర వేశారని ఆయన కొనియాడారు.

**బహుముఖ ప్రజ్ఞ:** దర్శకుడిగా, స్క్రీన్ ప్లే రచయితగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా, నటుడిగా ఆయన ప్రదర్శించిన బహుముఖ ప్రజ్ఞ చిరస్మరణీయం అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

**ప్రయోగాత్మక చిత్రాలు:** ఎన్నో విభిన్నమైన, ప్రయోగాత్మక



చిత్రాలతో ఆయన సినీ పరిశ్రమకు అందించిన సేవలు మరువలేనివని అన్నారు.

# ఇంద్రకీలాద్రిపై వీఐపీ దర్శనాలు నిలిపివేత.



**అక్టోబరు 4 (పెన్ పవర్):**

ప్రధాన సారాంశం: ఏపీలోని ఇంద్రకీలాద్రిపై ఇవాళ వీఐపీ దర్శనాలను నిలిపివేశారు. వరుస సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీ భారీగా పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.
ప్రొటోకాల్ దర్శనాలు: ఘాట్ రోడ్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రొటోకాల్ దర్శనాలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.
సామాన్య భక్తులకు లబ్ధి: ఈ తాత్కాలిక నిలిపివేతతో సామాన్య భక్తులకు దర్శనం సులభతరమవుతుందని భావిస్తున్నారు.

# ఎల్లుండి నుంచి గ్రూప్-1 అప్లికేషన్లు

**అక్టోబరు 4 (పెన్ పవర్):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 163 గ్రూప్-1 ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఎల్లుండి నుండి అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానుంది.
ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హత కలిగిన అభ్యర్థులు అందరూ కూడా ఈ నెల 6వ తేదీ నుండి 27వ తేదీ వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించుకోవాలని సూచించడం జరిగింది.
ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఇప్పటికే అభ్యర్థుల సౌలభ్యం కోసం ఒక కీలక ఆదేశం జారీ చేస్తూ, ప్రతి ఒక్కరూ తమ వన్ టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని స్పష్టం చేసింది.
సాధారణ డిగ్రీ అర్హత పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరు కూడా ఈ గ్రూప్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి పూర్తి అర్హత కలిగి ఉంటారు. అయితే ఇందులో ప్రత్యేకంగా డిఎస్పీ




(కమ్యూనికేషన్స్) పోస్టులకు మాత్రం అభ్యర్థులు తప్పనిసరిగా బీఈ లేదా బీటెక్ ఇంజనీరింగ్ విద్యార్హత కలిగి ఉండటం అత్యంత ఆవశ్యకం అని అధికారులు వెల్లడించారు.

# మట్టిలో ఇరుక్కుపోయిన డ్రైవర్.. రాత్రి నుంచి సహాయక చర్యలు



**అక్టోబరు 4 (పెన్ పవర్):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు మండలం ఎర్రమాడు శివారు ప్రాంతం, తెలంగాణ వెన్నవల్లి వద్ద గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న సమయంలో తీవ్రమైన ప్రమాదం సంభవించింది. యంత్రం సహాయంతో వాహనంలోకి గ్రావెల్ లోడ్ చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా గట్టు కూలిపోవడంతో లారీపై భారీగా మట్టి పెల్లలు పడిపోయాయి.
ఈ ఊహించని ప్రమాదం కారణంగా యంత్రం నడుపుతున్న డ్రైవర్ మట్టిలోనే చిక్కుకుపోవడం జరిగిందని అధికారులు వెల్లడించారు. శనివారం రాత్రి నుండి ఈ ప్రమాదం కొనసాగుతుండటంతో, డ్రైవర్‌ను సురక్షితంగా రక్షించడం కోసం సహాయక ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది.

# వడ్డెరల రాజకీయ హక్కుల కోసం జాతీయ స్థాయిలో పోరు తప్పదు: జాతీయ వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు ప్రెట్ల శ్రీధర్ పిలుపు

**అక్టోబరు 4 (పెన్ పవర్):**
చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిందే.. లేదంటే త్వరలో జాతీయ స్థాయిలో ఉగ్ర ఉద్యమం!రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వడ్డెరల సత్తా చాటాలని సంఘం ఉద్యమకారుల ఏకగ్రీవ తీర్మానంఇరు రాష్ట్రాల్లోనూ సమానంగా 5 ఎంపీ, 10 ఎమ్మెల్యే మరియు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని స్పష్టమైన డిమాండ్
వడ్డెర సామాజిక వర్గానికి చట్టసభల్లో సముచిత స్థానం మరియుతగినరాజకీయప్రాతినిధ్యంకల్పించాలని,లేనిచో జాతీయ స్థాయిలో పెద్దఎత్తున తీవ్ర ఉద్యమం చేపడతామని జాతీయ వడ్డెర సంఘంఉపాధ్యక్షులు ప్రెట్ల శ్రీధర్ హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో వడ్డెర వర్గానికి బలమైన రాజకీయ భాగస్వామ్యం దక్కేలా అత్యంత పట్టుదలతో ముందుకు వెళ్లాలని సంఘంఉద్యమకారులుఅంతాకలిసిఏకగ్రీవంగా




తీర్మానించినట్లు ఆయన వెల్లడించారు.ఇరు రాష్ట్రాల్లోనూ వడ్డెరల రాజకీయ డిమాండ్లు కచ్చితంగా నెరవేరాలని, ఇందులో భాగంగా:ఆంధ్రప్రదేశ్‌లో: 5 ఎంపీ స్థానాలు, 10 ఎమ్మెల్యే స్థానాలు మరియు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.
తెలంగాణలో: 5 ఎంపీ స్థానాలు, 10 ఎమ్మెల్యే స్థానాలుమరియుఎమ్మెల్సీస్థానాలుకేటాయించాలని కోరారు.ఒకవేళ ప్రధాన రాజకీయ పార్టీలు వడ్డెరల డిమాండ్లను పెడచెవిన పెడితే, త్వరలోనే జాతీయ స్థాయిలో ఉధృతమైన ఉద్యమం చేపడతామని ప్రెట్ల శ్రీధర్ మరియు వడ్డెర సంఘం నాయకులు తేల్చిచెప్పారు. కుల సంక్షేమం, రాజకీయ హక్కుల సాధనే ప్రధాన లక్ష్యంగా రానున్న రోజుల్లో మరింత ఉధృతమైన కార్యాచరణతో ముందుకు వెళ్తామని వారు స్పష్టం చేశారు.

# సుప్రీంకోర్టు మెట్లు ఎక్కే కన్నా.. ముఖ్యమంత్రుల చర్చల మేజాయే మేలు! – గోదావరి, కృష్ణా, కావేరి నదుల అనుసంధానంతోనే దక్షిణ భారతం కరువు రహిత, సస్యశ్యామల భవితకు మార్గం!

**అక్టోబరు 4 (పెన్ పవర్):**
దక్షిణభారత దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, మునుపెన్నడూఎదుర్కోనంతటి తీవ్రమైన తాగునీటి సంక్షోభాన్ని మరియు సాగునీటి కరువును మన నాలుగు రాష్ట్రాలు - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకమరియుతమిళనాడు ఎదుర్కొంటున్నాయి. ప్రతి వర్షాకాలంలో వచ్చే నీటి వివాదాలు, రాష్ట్రాల మధ్య ఘర్షణలు, చివరకు సుప్రీంకోర్టుకు వెళ్లి ఏళ్ల తరబడి కేసులు నడపడం వల్ల ప్రజల కష్టాలు తీరడం లేదు, కానీ కక్షలు మాత్రం పెరుగుతున్నాయి. ఈ అపసవ్య ధోరణికి ఇకనైనా చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైంది.
?సుప్రీంకోర్టు నిర్ణయం – పరిమిత పరిష్కారం:
చట్టపరమైన పోరాటాలు తమ పరిధిలో తాము ముఖ్యమైనవి కావచ్చు, కానీ అవి కేవలం తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే ఇస్తాయి. నదీ జలాల పంపిణీపై కోర్టులు ఇచ్చే తీర్పులు శాశ్వత పరిష్కారాన్నిచూపకపోగా, రాజకీయంగా మరింత చిచ్చు పెడతాయి. నీటి పారుదల రంగంలో నిపుణులు,ఇంజనీర్లుతరచుగా హెచ్చరిస్తున్నట్లుగా, వర్షాలు లేని కరువు కాలంలో కోర్టు ఉత్తర్వులు నదుల్లోకి నీటిని తీసుకురాలేవు. కేవలం న్యాయస్థానాల మీద ఆధారపడటం వల్ల రాష్ట్రాంతర మైత్రి దెబ్బతింటుంది తప్ప, ప్రజల దాహార్తి తీరదు.

**చర్చల మేజా - ఏకైక మార్గం:**
అందుకే, ఇప్పుడున్న ఏకైక మరియు పరిపూర్ణమైన మార్గం.. నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రాజకీయ




విభేదాలను పక్కనబెట్టి, ఒకే వేదికపై కూర్చొని "చర్చల మేజా" వద్ద సంప్రదింపులు జరపడం. ఈ సమావేశం ఎవరిపై ఎవరు ఆధిపత్యం చెలాయించాలనే దాని గురించి కాదు, రాబోయే తరాల మనుగడను కాపాడుకోవడం
కోసంజరగాలి.నదులుఅనేవిభౌగోళికసరిహద్దులకు లోబడవు, అవి ప్రకృతి ప్రసాదించిన సంపద. ఈ నదులను కాపాడుకోవడం, వాటిని సద్వినియోగం చేసుకోవడం మనందరి ఉమ్మడి బాధ్యత.

**నదుల అనుసంధానం - శాశ్వత పరిష్కారం:**
ముఖ్యమంత్రుల చర్చల ముఖ్య అజెండా "నదుల అనుసంధానం" పైనే కేంద్రీకృతం కావాలి. గోదావరి నదిలో సమృద్ధిగా లభించే మిగులు జలాలను, కృష్ణా నదికి మళ్లించడం, మరియు అక్కడి నుండి నేరుగా కావేరి బేసిన్‌లోకి అనుసంధానించడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చు.

**దీని వల్ల కలిగే ప్రయోజనాలు అపారమైనవి:**
కరువు రహిత దక్షిణాది: ఈ ప్రాజెక్టు పూర్తయితే, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మరియు తమిళనాడు రాష్ట్రాల్లోని ఎండిపోయిన భూములు, కరువు పీడిత ప్రాంతాలు పూర్తిగా కనుమరుగవుతాయి.

**సస్యశ్యామల భూములు:** ఎప్పుడూ నీటితో కళకళలాడే నదుల వల్ల, వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది, తద్వారా దేశానికి ఆహార భద్రత పెరుగుతుంది.

**శాశ్వత మైత్రి:** పరస్పరం నీటిని పంచుకోవడం వల్ల రాష్ట్రాల మధ్య ఉన్న అపార్థాలు తొలగిపోయి, మైత్రి బలోపేతమవుతుంది. సుప్రీంకోర్టుకు వెళ్లాల్సిన అవసరమే ఉండదు.

**తాగునీటి భరోసా:** చెన్నై వంటి మహానగరాలకు, ఇతర ప్రధాన పట్టణాలకు మరియు గ్రామాలకు తాగునీటికి ఎటువంటి ధోకా ఉండదు.

**ముగింపు - సంకల్పం కావాలి:**
నదులను అంతర్ధానం కాకుండా కాపాడి, వాటిని అనుసంధానిస్తేనే.. దక్షిణ భారతం కరువు పీడను వదిలించుకుని, బంగారు భవిష్యత్తును సొంతం చేసుకోగలదు. ఈ చారిత్రక మరియు మహోన్నత కార్యానికి శ్రీకారం చుట్టడానికి పాలకులకు కేవలం రాజకీయ సంకల్పం మాత్రమే కావాలి. ఇప్పటికైనా మన ముఖ్యమంత్రులు ఏకమై, ఈ దిశగా చొరవ తీసుకుంటారని, సుప్రీంకోర్టు దాకా వెళ్లకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుంటారని ఆశిద్దాం!

# నీట్ పరీక్షలో అద్భుత విజయం సాధించి, ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉచిత సీటు దక్కించుకున్న వడ్డెర బిడ్డ కావ్య – సమాజానికి గర్వకారణంగా నిలిచిన యువ ప్రతిభ!

**అక్టోబరు 4 (పెన్ పవర్):**
ప్రజాదాసనం (డక్కిలీ) సబ్ డివిజన్ పరిధిలోని డక్కిలీ మండలం డి.వడ్డేపల్లి గ్రామానికి చెందిన వడ్డెర కుటుంబంలో యువ ప్రతిభ వెలుగు చూసింది. ఆ గ్రామానికి చెందిన మహేష్, నర్సింహాచారి, చెల్లమ్మల కుమార్తె అయిన కావ్య.. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా నీట్ పరీక్షలో అద్భుతమైన ర్యాంక్ సాధించారు. ఈ ఘన విజయం ద్వారా ఆమె ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎలాంటి ఫీజు లేకుండా ఉచిత వైద్య సీటును సొంతం చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఎంతో ఆనందంగా తెలిపారు.
చదువు చేస్తే కలలు నిజమవుతాయి, విద్యే నిజమైన బలం అనే నానుడిని కావ్య నిజం చేసి చూపించారు. డక్కిలీ గ్రామంలోని బంధువులు, శ్రేయోభిలాషులు మరియు స్థానిక సన్నిహితులు ఈ గొప్ప విజయం పట్ల




తమ హర్షం వ్యక్తం చేస్తూ, ఇది తమ ప్రాంతానికి ఎంతో గర్వకారణమైన విషయమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యుల పూర్తి ప్రోత్సాహం, వెన్నుదన్నుతోనే తను కన్న కలలను కావ్య సాకారం చేసుకోగలిగారు.
నేడు వడ్డెర బిడ్డల ప్రతినిధిగా ఎదుగుతూ, భవిష్యత్తు తరాలకు కావ్య ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. ఈ ఉజ్వల విజయం సాధించడానికి ఎంతగానో కృషి చేసిన విద్యార్థిని కావ్యకు మరియు ఆమెను వెనుకనుండి ప్రోత్సహించిన కుటుంబ సభ్యులకు పలువురు ప్రముఖులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విద్యతో ఎదిగే ప్రతి బిడ్డ వడ్డెర సమాజానికే అత్యంత గర్వకారణం అని ఈ సందర్భంగా స్థానికులు కొనియాడారు.

# ఎల్లార్తి ఎస్సీ కాలనీలో అభివృద్ధికి బాటలు – రూ.10 లక్షల సీసీ రోడ్లకు ఘనంగా భూమి పూజ.

## చంద్రబాబు పాలనలో పల్లెలే ప్రగతికి పట్టుకొమ్మలు – వైకుంఠం జ్యోతి, శివప్రసాద్ చొరవతో అభివృద్ధి పరుగులు

**( కర్నూలు జిల్లా ఇన్చార్జ్ )అక్టోబరు 4 (పెన్ పవర్):**
ఆలూరు నియోజకవర్గం పరిధిలోని హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు నారాచంద్రబాబునాయుడు,ఉపముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ సారథ్యంలో, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌దార్శనికతతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు
పెడుతోందని,అందులోభాగంగానేహొళగుందమండలం ఎల్లార్తిగ్రామంలోఅభివృద్ధిపనులుశరవేగంగాజరుగుతున్నాయని నాయకులు పేర్కొన్నారు.ఆలూరు నియోజకవర్గ టీడీపీఇంచార్జ్,ప్రజానాయకురాలుగౌరవనీయులుశ్రీమతి వైకుంఠంజ్యోతి మరియు యువ నాయకులు వైకుంఠం శివప్రసాద్ ప్రత్యేక చొరవ మరియు సహకారంతో ఎల్లార్తి గ్రామ ఎస్సీ కాలనీలో రూ. 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఈరోజు అంగరంగ వైభవంగా భూమి పూజ నిర్వహించారు.ఎన్నో ఏళ్లుగా ఎస్సీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో కాలనీ వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వర్షాకాలంలో బురదమయంగా







మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు సీసీ రోడ్లు మంజూరు చేయించిన వైకుంఠం జ్యోతి గారికి కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ"ఎస్సీ కాలనీల అభివృద్ధే మా ప్రభుత్వ ధ్యేయం. గత ప్రభుత్వం ఎస్సీ కాలనీలను పట్టించుకోలేదు. కానీ మా కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి పల్లెలో, ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు,
తాగునీరువంటిమౌలికసదుపాయాలుకల్పించడమేలక్ష్యంగాపనిచేస్తున్నాం.ఎల్లార్తినిఆదర్శగ్రామంగాతీర్చిదిద్దుతాం'' అని తెలిపారు.ఈ కార్యక్రమంలోటీడీపీ సీనియర్ నాయకులు బోయ మల్లికార్జున , టీడీపీ నాయకులు మాల రామప్ప, టీడీపీ యువ నాయకుడు ఎల్లార్తి చిదానంద, వీరేష్ ,ఎస్సీ కాలనీ పెద్దలు ఎంకోబా , పెద్ద ముకప్ప , దాసుల వెంకటేష్, శేషగిరి, నరసింహులు, రసమన్న, ఎల్లప్ప, హరిజన నాగరాజ్, దుర్గప్ప,టీడీపీ యువ నాయకులు శశికాంత్, చంద్ర, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ కాలనీ మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కూటమి పద్మవ్యూహం....వైసీపీ తట్టుకోగలదా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను త్వరలో నిర్వహించనుంది. అయితే 2021లో వైసీపీ ప్రభుత్వం హయాంలో కూడా స్థానిక ఎన్నికలు జరిగాయి. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటి అంటే ఆనాడు పరోక్ష ఎన్నికలు జరిగాయి. మేయర్ జెడ్పీ చైర్మన్లను సభ్యులు ఎన్నుకునే వారు. దాంతో పెద్ద ఎత్తున సభ్యుల బలం కోసం ఏకగ్రీవాలను వైసీపీ ప్రోత్సహించింది అన్న విమర్శలు వచ్చాయి. అంతే కాదు ప్రతిపక్ష పార్టీలు నామినేషన్లు కూడా వేయకుండా అధికార బలంతో అడ్డుకుందని కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో జెడ్పీ ఎన్నికల నుంచి టీడీపీ మధ్యలోనే తప్పుకుని తన నిరసనను వ్యక్తం చేసింది. మొత్తానికి నూటికి తొంభై శాతం దాకా వైసీపీ గెలిచి లోకల్ బాడీస్ లో పాగా వేసింది. అయినా ఏమి లాభం, 2024 లో ఈ స్థానిక ఎన్నికల ఫలితాలు పెద్దగా ఉపయోగపడలేదు, వైసీపీ చిత్తుగా ఓటమి పాలు అయింది.



**కట్ చేస్తే కూటమి సర్కార్ :**
ఇక ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్థానిక ఎన్నికలను నిర్వహిస్తోంది. ఈ ఎన్నికల్లో నిజానికి వైసీపీ మొదట పాల్గొనరాదనే చర్చ సాగింది అని అంటున్నారు. ఎపుడైతే మేయర్ జెడ్పీ చైర్మన్లు మునిసిపలి చైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమలులోకి తీసుకుని వచ్చారో దాంతో వైసీపీలో కొత్త ఆశలు చిగురించాయి. ప్రత్యక్ష ఎన్నికలు కాబట్టి కీలక పదవుల విషయంలో పార్టీ జెండా జగన్ ఇమేజ్ ఉపయోగపడతాయని భావిస్తూ ఆ పార్టీ పోటీ చేయాలని నిర్ణయించుకుంది. ఇక జగన్ అయితే వెరీ సీరియస్ అన్నట్లుగా లోకల్ బాడీ ఎన్నికలను తీసుకున్నారు. పదే పదే పార్టీ సమావేశాలలో ఆయన ఎన్నికలు చాలా కీలకం అని ప్రస్తావిస్తున్నారు. పార్టీ శ్రేణులను ఆయన ఎన్నికల సమరం వైపుగా నడిపించే ప్రయత్నం చేస్తూ ఉత్సాహం నింపుతున్నారు.

**అదే సందేహంగా :**
అంతవరకూ బాగానే ఉంది కానీ కూటమి ప్రభుత్వం కూడా ఆనాడు వైసీపీ చేసినట్లుగా అధికార బలం చూపిస్తే ఏమవుతుంది అన్నదే ఫ్యాన్ పార్టీలో సందేహంగా ఉంది. నామినేషన్ల నుంచే నాడు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు ప్రతిపక్షాలు ఎదుర్కొన్నారు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి ఉంటుందా అని చర్చిస్తున్నారు. అభ్యర్థులను నిలబెట్టడం వరకూ అయితే వైసీపీ అధినాయకత్వం వారికి ఉత్సాహం ఇస్తోంది. అయితే వారు రంగంలో చివరి దాకా ఉండాలి. అధికార కూటమి ఒత్తిళ్లను తట్టుకోవాల్సి ఉంటుంది. అంతే కాదు పోలీసులను ప్రయోగిస్తే ధీటుగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక అభ్యర్థులుగా ఉన్న వారి చరిత్రను మొత్తం తిరగతోడే చాన్స్ ఉంది. ఇలా అన్ని వైపుల నుంచి వచ్చే కష్టాలను నష్టాలను భరిస్తూ వైసీపీ శ్రేణులు ఎంతవరకూ ముందుకు వెళ్తాయి అన్నది పార్టీ పెద్దలలో కూడా ఉంది అని అంటున్నారు.

**నిలిచి పోరాడితేనే :**
అన్ని ఇబ్బందులు అధిగమించి నిలిచి పోరాడితేనే వైసీపీ గెలిచినట్లు అని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకూ చూస్తే ప్రజాభిప్రాయంలో పెద్దగా తేడా ఏమీ ఉండదని అంటున్నారు. ఇంకా కూటమి చేతిలో సగం పాలన ఉండగా జనాలు ప్రతిపక్షాన్ని గెలిపించి అభివృద్ధిని తమ ప్రాంతంలో దూరం చేసుకోరని కూడా అంటున్నారు. అందువల్ల వైసీపీ పెద్ద ఎత్తున గెలిచేస్తుంది అన్నది ఆ పార్టీలో ఉత్సాహం కోసం అన్నట్లుగానే చూడాలని అంటున్నారు అదే సమయంలో వైసీపీ తుది వరకూ పోరాడి తన ఓటు బ్యాంక్ ని కాపాడుకుంటూ నిలిస్తే మాత్రం అదే అసలైన గెలుపుగా చూడాలని అంటున్నారు. అధినాయకత్వం కూడా అందుకోసమే పోటీకి దింపుతోందని చెబుతున్నారు. మరి వైసీపీ తట్టుకుంటుందా అన్నదే అతి పెద్ద ప్రశ్నగా ఉంది.

# అందుకే కళ్ళు మూసుకున్నాం... చిన్న శ్రీనుపై బొత్స !



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయనగరం జిల్లాలో స్థానిక ఎన్నికల రాజకీయం కంటే కూడా వైసీపీలో చిన్న శ్రీను ప్రకంపనలు తదనంతర పరిణామాలే ఎక్కువ హీట్ ని పుట్టిస్తున్నాయి. చిన్న శ్రీను పార్టీని వీడి నెల రోజులు అవుతున్నా ఆ ప్రభావం వైసీపీని స్థిమితం లేకుండా చేస్తోంది. తాజాగా చిన్న శ్రీను వియ్యంకుడు బడ్డుకొండ అప్పలనాయుడు సస్పెండ్ అయ్యారు. దాంతో ఆగ్రహించిన ఆయన వైసీపీకి గుడ్ బై చెప్పారు. మరిన్ని వికెట్లు పడబోతున్నాయని చిన్న శ్రీను వర్గం ఒక వైపు సంకేతాలు ఇస్తోంది. విజయనగరం జిల్లా వైసీపీ అంటేనే మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నంతగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ మొత్తం పరిణామాల మీద బొత్స తనదైన శైలిలో స్పందించారు. ఎస్ కోట నియోజకవర్గంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో బొత్స మాట్లాడుతూ పార్టీని వీడిన వారిది దోపిడీయే అజెండా అని హాట్ కామెంట్స్ చేశారు.

**పోతే ఏటవుతాది :**
బొత్స ఉత్తరాంధ్ర భాషలో మాట్లాడుతూ పార్టీ అన్నాక ఇలాంటివి సహజం అన్నారు. ఒకరిద్దరు నాయకులు బయటకు వెళ్ళినంత మాత్రాన ఏమవుతుందని ప్రశ్నించారు. పార్టీ ఎప్పటికీ శాశ్వతం అన్నారు. వైసీపీకి జనంలో ఆదరణ ఉందని ప్రజలు పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. అందువల్ల నాయకులు వెళ్తే పార్టీకి ఏమీ కాదని చెప్పారు. స్వార్థంతో స్వలాభంతోనే కొందరు పార్టీని వీడిపోతున్నారు అని ఆయన మండిపడ్డారు. నాయకులు వెళ్ళినంత మాత్రాన కార్యకర్తలకు ఎలాంటి నష్టం లేదని అన్నారు. వారికి పార్టీ అండగా ఉంటుందని బొత్స చెప్పారు.

**ప్రేమ ఎక్కువైపోయి :**
చిన్న శ్రీను పార్టీని వీడడం మీద బొత్స వ్యాఖ్యానిస్తూ అభిమానం ప్రేమ ఉన్న చోట కళ్ళు మూసుకుని పోతాయని వ్యాఖ్యానించారు. అందువల్లనే ఇన్నాళ్ళూ కొన్ని విషయాలని పట్టించుకోలేదని అన్నారు. అది తమ అవివేకం కూడా కావచ్చు లేదా అశ్రద్ధ కూడా కావచ్చు అని బొత్స తన మీదనే సెటైర్లు వేసుకున్నారు. ఆనాడు దృష్టి పెట్టకపోవడం వల్లనే ఇలాంటివి జరిగాయని, ఇలా ఫిరాయిస్తున్న వారి అసలు ఉద్దేశ్యాలు కూడా ఆలస్యంగానే అర్థం అయ్యాయని ఆయన చెప్పుకొచ్చారు. ఈసారి చాలా జాగ్రత్తగా ఉంటామని కార్యకర్తలకే పెద్ద పీట వేస్తామని ఆయన చెప్పారు.

**కష్టపడిన వారికే :**
ఎవరైతే పార్టీ కోసం పనిచేస్తారో కష్టపడతారో వారికే ప్రాధాన్యత ఉంటుందని బొత్స అన్నారు. తాను క్యాడర్ కి అండగా ఉంటాను అని ఆయన హామీ ఇచ్చారు. ఏపీలో కూటమి పాలన తీరు మీద కూడా ఆయన నిప్పులు చెరిగారు. తన మొత్తం రాజకీయ జీవితంలో ఈ తరహా దోపిడీ పాలన చూడలేదని బొత్స మండిపడ్డారు. ప్రజలతో కలిసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాల మీద వైసీపీ ఉద్యమిస్తుందని బొత్స స్పష్టం చేశారు.

**బొత్స చెప్పిందేంటి :**
ఇవన్నీ పక్కన పెడితే బొత్స చెప్పిందేంటి అన్నది వైసీపీలో చర్చ సాగుతోంది. సొంత మేనల్లుడు కాబట్టే చూసీ చూడనట్లుగా వ్యవహరించామని ఇపుడు ఆయన పశ్చాతాపం పడుతున్నారా అన్నది కూడా ఆలోచిస్తున్నారు. బొత్సకు చిన్న శ్రీను పార్టీని వీడడం వంటి పరిణామం అయితే ఇబ్బందికరంగా మారిందనే అంటున్నారు. పోయే వారు పోతారు అని తేలికగా అంటున్నా జిల్లా రాజకీయాల్లో వైసీపీకి అలాగే బొత్స ఆధిపత్యానికి ఒక సవాల్ గానే ఈ పరిణామాలు ఉండబోతున్నాయని కూడా విశ్లేషిస్తున్నారు.

# ఐరోపా అంటుకుంది.. ఆ రెండు దేశాలు అట్టుడుకుతున్నాయి..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐరోపా ఖండంలోని రెండు ఆర్థిక వ్యవస్థలైన ఫ్రాన్స్, స్పెయిన్‌లు ప్రస్తుతం తీవ్ర సామాజిక, రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ వేలాది మంది ప్రజలు, యువత రోడ్లపైకి వచ్చి చేస్తున్న ఆందోళనలు ఆయా దేశాలలో కలకలం సృష్టిస్తున్నాయి. వేర్వేరు అంశ ప్రాతిపదికన ఈ నిరసనలు ఉద్భవించినప్పటికీ.. ప్రభుత్వాల విధానాల పట్ల పౌరుల్లో పెరుగుతున్న అసంతృప్తి, నిరాశలు ఈ పోరాటాలకు ప్రధాన ఇంధనంగా మారాయి. రోజువారీ జీవితాన్ని శాసిస్తున్న ప్రాథమిక వసతుల కరవుపై పౌరులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్రాన్స్‌లో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. దేశ విద్యావ్యవస్థలో పేరుకుపోయిన లోపాలు, నిర్లక్ష్య వైఖరిపై విద్యార్థి లోకం మండిపడుతోంది. పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడానికి అవసరమైన ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండటంతో పాటు.. తరగతి గదుల కొరత విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. కనీస మౌలిక సదుపాయాలు లేని వాతావరణంలో విద్యను కొనసాగించాల్సి రావడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిరసనకారులు వీధుల్లో నిర్వహించిన ర్యాలీలు, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో పలు నగరాలు అట్టుడికాయి. కొద్ది ప్రాంతాల్లో ఆందోళనలు అదుపు తప్పడంతో పోలీసులు బలాన్ని ప్రయోగించాల్సి వచ్చింది. ఈ క్రమంలో సుమారు ఐదు వేల మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఫ్రాన్స్ చరిత్రలోనే నిరసనల తీవ్రతను ప్రతిబింబిస్తోంది. విద్యా వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేసి.. మౌలిక సదుపాయాలను వెంటనే మెరుగుపరచకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయి.




మరోవైపు స్పెయిన్‌లో గృహ నిర్మాణ, అద్దెల సంక్షోభం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. నియంత్రణ లేని అద్దెల పెంపు సామాన్య, దిగువ మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది. ఆదాయంలో అధిక భాగం నివాస ఖర్చులకే వెచ్చించాల్సి రావడంతో జీవన ప్రమాణాలు ఘోరంగా పడిపోతున్నాయని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల అద్దెలపై తక్షణమే పరిమితులు విధించాలని.. అద్దెకు ఉంటున్న వారిని యజమానులు అన్యాయంగా ఖాళీ చేయించకుండా చట్టపరమైన రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్పెయిన్‌లోని దాదాపు యాభైకి పైగా నగరాల్లో ఈ తరహా పోరాటాలు కొనసాగుతున్నాయి. వేలాది మంది ఆందోళనకారులు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. విద్య, గృహ వసతి వంటి అత్యంత ప్రాథమిక హక్కుల నిరాకరణ పట్ల పౌరుల్లో వ్యక్తమవుతున్న ఈ అసంతృప్తి కేవలం

తాత్కాలికమైనది కాదని.. ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రాథమిక అవసరాలను తీర్చడంలో అధికార యంత్రాంగాలు విఫలమైనప్పుడు ప్రజలలో కలిగే తీవ్రమైన నిరాశే ఇటువంటి నిరసనలకు మూలకారణం. పరిస్థితి మరింత విషమించక ముందే ప్రభుత్వాలు స్పందించి.. నిరసనకారుల సమంజసమైన డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరించకపోతే.. ఈ ఉద్యమాలు మరింత తీవ్రరూపం దాల్చి దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితులను మరింత ప్రమాదంలో పడేసే అవకాశం ఉంది.

# వారసులకు నో టికెట్ ?



**హైదరాబాద్ పెన్ పవర్:** వారసులు అంటేనే అది ఒక అర్హతగా చాలా మంది ముందుకు వస్తున్నారు. దాంతో పార్టీలో ఏళ్ల తరబడి ఉన్న వారు, అవకాశాల కోసం వేచి చూస్తున్న వారు వెనకబడిపోతున్నారు. అదే సమయంలో పార్టీ కొందరికి మాత్రమే పరిమితం అవుతోంది అన్న చర్చకు కూడా ఆస్కారం ఉంటోంది. అందుకే వారసులకు టికెట్ విషయంలో టీడీపీ స్ట్రాంగ్ డెసిషన్ తీసుకుందని ప్రచారం సాగుతోంది. టీడీపీ మాత్రమే కాదు కూటమి పార్టీలకు కూడా ఇదే రూల్ వర్తించేలా ఉమ్మడి డెసిషన్ చేస్తున్నారు అని కూడా అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఇపుడు పెద్ద ఎత్తున పోటీ పడుతున్న వారసులకు ఈ నిర్ణయం అమలు అయితే మాత్రం నిరాశ తప్పదని అంటున్నారు.

**మేయర్ చుట్టూనే :**
విశాఖ మేయర్ చుట్టూ వారసులు పోటీ మామూలుగా లేదు, కేవలం ముగ్గురు నేతలు తప్పించి ఉమ్మడి విశాఖ జిల్లాలో దాదాపుగా అంతా కూడా తమ వారి కోసం విపరీతంగా ప్రయత్నాలు చేస్తున్నారు అని అంటున్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, అలాగే జనసేనకు చెందిన పెందుర్తి అనకాపల్లి ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, కొణతాల రామకృష్ణ మాత్రమే ఈ వారసులని తీసుకుని రావడం లేదు. వారి నుంచి మాత్రమే ఎలాంటి సిఫార్సులు లేవని అంటున్నారు. వీరు తప్పించి మిగిలిన వారు అంతా తమ కుటుంబాలలో సతీమణినో అన్న దమ్ములనో కుమారుడు లేదా కుమార్తెలనో మేయర్ కుర్చీ కోసం పోటీకి పెట్టాలని తపిస్తున్నారు అని ప్రచారం సాగుతోంది.

**అడ్డుకట్ట పడినట్లే :**
కూటమి పార్టీలు కనుక ఉమ్మడిగా వారసులకు నో టికెట్ అన్న కీలక నిర్ణయం తీసుకుంటే మాత్రం వారికి అడ్డుకట్ట పడుతుందని అంటున్నారు. అంతే కాదు మేయర్ రేసులో ఉన్న వారిలో సగానికి సగం మంది పక్కకు తప్పుకున్నట్లు అవుతుందని అంటున్నారు. అసలు ఇలా ఎందుకు కూటమి పార్టీలు ఆలోచన చేస్తున్నాయంటే ఒకరి వారసులకు ఇస్తే మరో నేత తమ వారికి ఇవ్వలేదని అసంతృప్తి చెందే చాన్స్ ఉంటుంది. అది నాయకుల మధ్య పార్టీల మధ్య సమస్యగా మారుతుంది. అలాగే కార్యకర్తలు సైతం తీవ్ర అసంతృప్తి చెందుతారు. పార్టీ కోసం కష్టపడిన ద్వితీయ తృతీయ శ్రేణి నేతలు కూడా అసహనానికి లోను అవుతారు. అందుకే వీటికి చెక్ చెప్పేందుకే ఈ డెసిషన్ తీసుకుంటున్నారు అని అంటున్నారు.

**కొత్త వారికే :**
ఇక జీవీఎంసీలో మేయర్ తో పాటు 120 వార్డులలో అత్యధిక శాతం పార్టీలో యువతకు కొత్త తరానికి అవకాశం ఇవ్వాలని కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. దాని వల్ల నాయకత్వం పెరగడమే కాకుండా జనంలోనూ సానుకూలత ఏర్పడుతుందని పార్టీల విజయానికి అది కారణం అవుతుందని కూడా అంచనా వేస్తున్నారు. అలా బహుముఖీయమైన ప్రయోజనాలను ఆశించి వారసులకు చెక్ చెప్పబోతున్నారు అని అంటున్నారు. మరో వైపు చూస్తే కేవలం విశాఖ మేయర్ కే కాకుండా రాష్ట్రంలో వీలైనంత మేర వారసులను దూరంగా పెట్టాలని కూడా కూటమి పార్టీలు ఆలోచన చేస్తున్నాయని అంటున్నారు. దీని వల్ల స్థానిక సంస్థలలో యువతకు మహిళలకు అలాగే సమర్థ నేతలకు మరిన్ని అవకాశాలు దక్కుతాయని అంటున్నారు. ఒక విధంగా ఇది మంచి నిర్ణయం అని అంతా స్వాగతిస్తున్నారు. ఒక నాయకుడి ఇంటికే పదవులు అన్నీ వెళ్లడం కంటే అధికారం వికేంద్రీకరణ జరగడం అర్హులకు అందలాలు దక్కడమే అసలైన ప్రజాస్వామ్యం అని అంటున్నారు.

# ఏపీ కూటమి సర్కారుకు అదే 'అభయం'!



**హైదరాబాద్ పెన్ పవర్:** అన్ని కాంబినేషన్లు సూపర్ హిట్ కావు. సినిమాల సంగతి ఎలా ఉన్నా రాజకీయాలు అందుకు పూర్తి భిన్నం. రెండు రాజకీయ పార్టీలు కలిసి భాగస్వామ్యంతో ప్రభుత్వాన్ని నడపటం అంత తేలికైన విషయం కాదు. ఏపీలో అయితే ఏకంగా మూడు పార్టీలు. అది కూడా మిగిలిన మూడు భిన్నమైన పార్టీ. నిజానికి ఈ పార్టీల మధ్య పొత్తే ఒక విచిత్రం. ఎందుకంటే భావసారూప్యతల సంగతి పక్కన పెడితే.. ఈ మూడు పార్టీల అధినేతలు మినహాయించి.. నేతలు.. క్యాడర్.. చివరకు ఈ పార్టీల మద్దతుదారులు.. సానుభూతిపరుల మధ్య కూడా కలిసిమెలిసి ఉన్నట్లుగా కనిపించదు. మూడు పార్టీల అగ్రనేతలు మినహాయించి.. మిగిలిన వారి మధ్యన అభిప్రాయభేదాలకు కొదవ లేదు. ఈ కారణంగానే.. తమ మధ్య ఉన్న దూరాన్ని అధినేతలకు అపాదించే క్రమం కనిపిస్తూ ఉంటుంది. ఇక్కడే ఏపీ కూటమి పార్టీ మధ్య ఒక ఆసక్తికర మేజిక్ కనిపిస్తుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఇప్పటివరకు ప్రతి మూడు నెలలకు ఒక ప్యాట్రన్ కొట్టొచ్చినట్లు కనిపిస్తూ ఉంటుంది. మీడియా.. సోషల్ మీడియా.. వాట్సప్ గ్రూపుల్లో కూటమి పార్టీలు ముఖ్యంగా తెలుగుదేశం –జనసేన మధ్య పొరపొచ్చాలు మొదలయ్యాయని.. టీడీపీ అధినాయకత్వం తీరు మీద జనసేనాని గుర్రుగా ఉన్నారని చెబుతూ.. దానికి రెండు మూడు అంశాల్ని సాక్ష్యంగా చూపిస్తూ చర్చలు మొదలు పెడతారు. అది అంతకంతకూ పెరుగుతూ ఉంటుంది. కొద్ది రోజులకు అదేమీ లేదన్నట్లుగా ఏదో ఒక కార్యక్రమంలోనూ.. మరే సందర్భంలోనో చంద్రబాబు, పవన్ మధ్య ఆత్మీయ అనుబంధం అలానే కొనసాగుతుందన్నది స్పష్టమవుతుంది. అంతేకాదు.. పవన్.. లోకేశ్ మధ్య కూడా వేలెత్తి చూపించేలా వ్యవహారశైలికి సంబంధించిన సాక్ష్యాలు ఉండకపోవటం.. జరుగుతున్న ప్రచారానికి భిన్నంగా వారిద్దరూ ఆత్మీయంగా కలిసి ఉండటం కనిపిస్తుంది. కూటమి సర్కారులో సూపర్ పవర్ గా పేర్కొనే లోకేశ్.. జనసేనానితో మాత్రం ఒదిగి ఉంటారు. నిజంగానే అన్న ఉంటే.. తమ్ముడు ఎలా బిహేవ్ చేస్తాడో.. అలానే పవన్ ముందు లోకేశ్ తీరు ఉంటుంది. ఇక్కడే మరో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. నిజానికి ఈ తీరే కూటమి సర్కారుకు శ్రీరామరక్షగా చెప్పాలి. చంద్రబాబు.. పవన్ కల్యాణ్ మధ్య బంధం కూడా ఎంతో మెచ్యూర్డ్ గా కనిపిస్తుంది. కొన్ని అంశాల విషయంలో చంద్రబాబు పాలన మీద పవన్ కు విభేదాలు ఉన్నా.. వాటిని బయటకు రానివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. అదేసమయంలో పవన్ కల్యాణ్ మనసుకు నొచ్చుకునేలా వ్యవహరించేందుకు చంద్రబాబు సుతారం ఇష్టపడని తత్త్వం కనిపిస్తుంది. అందుకే ఆచితూచి అన్నట్లుగా వ్యవహరిస్తారు. కూటమి సర్కారులో పవన్ కల్యాణ్ కు ప్రాధాన్యత తగ్గుతుందన్న మాట తరచూ వినిపించే క్రమాన్ని వెంటనే గుర్తించటం.. దానికి ఫుల్ స్టాప్ పెట్టేలా చంద్రబాబు చేతల్లో చూపించటం కనిపిస్తుంది. ఇక్కడే మరో అంశాన్ని ప్రస్తావించాలి. గతంలోనూ పలు పార్టీల భాగస్వామ్యంతో పని చేసిన సందర్భాలు ఉన్నాయి. అన్ని సందర్భాల్లోనూ తనకున్న బలాన్ని ప్రదర్శించేందుకు చంద్రబాబు వెనుకాడేవారుకాదు. కానీ.. కూటమి సర్కారులో అలా కాదు. తనకున్న బలం కంటే కూడా పవన్ తో ఉన్న బంధానికే అధిక ప్రాధాన్యత ఇవ్వటం కనిపిస్తుంది. పవన్ సైతం తనకున్న బలం.. తన పార్టీకి ఉన్న శక్తిసామర్థ్యాలు.. తన ప్రత్యర్థికి, తనకు ఉన్న తేడాను గుర్తించే విషయంలో ప్రాక్టికల్ గా ఉండటం కూడా కూటమి సర్కారు సాఫీగా సాగేందుకు సాయం చేస్తుందని చెప్పాలి. చేతి వేళ్లు ఒకేలా ఉండవన్న విషయాన్ని చంద్రబాబు.. పవన్ కల్యాణ్.. లోకేశ్ లు పూర్తిగా ఏకీభవించటమే కాదు.. అలా లేకపోవటం లోపం కాదు.. అదో సానుకూలాంశమన్న విషయాన్ని బలంగా నమ్ముతారు. వేళ్లన్ని ఒకేలా ఉండకపోవటమే అసలుసిసలు బలమన్నట్లుగా.. కూటమిలోని భిన్నత్వమే వారిని ఏకం చేస్తుందన్న విషయాన్ని మర్చిపోకూడదు. కూటమి సర్కారులోని భాగస్వామ్య పక్షాలన్నికూడా తమ బలాలు.. బలహీనతలు మాత్రమే కాదు.. తామంతా కలవటానికి కారణమైన అంశాల్ని మర్చిపోకపోవటమే అసలుసిసలు మేజిక్ గా చెప్పాలి.

# వైభవ్ సూర్యవంశీకి నో ఛాన్స్.. వెస్టిండీస్‌తో తొలి T20కి ప్లేయింగ్ XI ఇదే!





**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా.. ఇప్పుడు 5 మ్యాచ్‌ల ౨20 సిరీస్‌కు సిద్ధమైంది. పొట్టి ఫార్మాట్‌లో జరగనున్న ఈ సిరీస్ అక్టోబర్ 6వ తేదీ నుంచి లక్నోలోని ఏకనా క్రికెట్ స్టేడియం దీ గ్రౌండ్‌లో ప్రారంభం కానుంది. ఇటీవల జపాన్ వేదికగా ముగిసిన 2026 ఆసియా క్రీడలలో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు స్వర్ణ పతకం సాధించి అజేయ ఊపు మీదుంది. ఆసియా గేమ్స్ లో వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో ఆడిన ఈ యువ జట్టు, ఇప్పుడు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలో విండీస్‌తో తలపడనుంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా పేస్ స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌కు దూరంగా ఉంది.

### తొలి T20I కోసం పుజారా ప్లేయింగ్ XI ఇదే:

ఈ నేపథ్యంలో వెస్టిండీస్‌తో జరగబోయే తొలి ౨20 మ్యాచ్ కోసం టీమిండియా మాజీ బ్యాటర్ ఛటేశ్వర్ పుజారా స్టార్ స్పోర్ట్స్ కోసం తన ప్లేయింగ్ ఎలెవెన్‌ను ప్రకటించాడు. ఆసియా క్రీడల్లో అద్భుత ప్రదర్శన చేసిన యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీని పుజారా తన తుది జట్టు నుంచి పక్కన పెట్టి బెంచ్‌కే పరిమితం చేశారు.

ఓపెనర్లుగా వికెట్ కీపర్ సంజు శాంసన్, అభిషేక్ శర్మలకు పుజారా చోటు కల్పించారు. ఇక మూడో స్థానంలో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లను ఎంచుకున్నారు. మిగతా బ్యాటింగ్ ఆర్డర్‌లో తిలక్ వర్మ (5), శివమ్ దూబే (6), ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (7) స్థానం సంపాదించారు.

స్పిన్ విభాగంలో అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్‌లకు చోటు దక్కగా.. పేస్ అటాక్‌లో అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు యువ ఆటగాడు ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం ఇచ్చారు. అయితే ఆశ్చర్యకరంగా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు పుజారా తన తుది జట్టులో చోటు కల్పించలేకపోయాడు.

వెస్టిండీస్‌తో జరిగే తొలి ౨20 కోసం నా ప్లేయింగ్ ఎలెవెన్ ఇదే: సంజు శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా వస్తారు. నం.3లో ఇషాన్ కిషన్, నం.4లో శ్రేయస్ అయ్యర్, నం.5లో తిలక్ వర్మ, నం.6లో శివమ్ దూబే, నం.7లో నితీశ్ కుమార్ రెడ్డి, నం.8లో అక్షర్ పటేల్, నం.9లో కుల్దీప్ యాదవ్, నం.10గా అర్ష్‌దీప్ సింగ్, నం.11గా ప్రిన్స్ యాదవ్ ఉంటారని పుజారా పేర్కొన్నారు.

### తొలి T20 ప్లేయింగ్ ఎలెవెన్:

సంజు శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్.

# ఈ స్వర్ణం తేలిగ్గా రాలేదు.. వారి అనుభవమే మా విజయానికి కారణమైంది: సంజూ శాంసన్

**ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్న భారత పురుషుల క్రికెట్ జట్టు**

**ఈ స్వర్ణం తేలిగ్గా రాలేదని వ్యాఖ్యానించిన సంజూ శాంసన్**

**అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉండటమే విజయానికి కారణమని వెల్లడి**

**ఫైనల్ ఒత్తిడిని అధిగమించడంలో సీనియర్లు కీలకపాత్ర పోషించారన్న సంజూ**





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఉత్కంఠభరిత ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే, ఈ స్వర్ణం తమకు సులభంగా దక్కలేదని, దీనికోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందని భారత వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ అన్నాడు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన 'ఏ' టీమ్‌ను బరిలోకి దించడం వల్లే పాకిస్థాన్‌తో ఫైనల్ మ్యాచ్‌లో ఒత్తిడిని అధిగమించగలిగామని స్పష్టం చేశాడు. ఈ విజయం అనంతరం సంజూ శాంసన్ మాట్లాడుతూ.. "మాది చాలా అనుభవజ్ఞులైన జట్టు. ప్రాక్టీస్, మ్యాచ్‌లు లేనప్పుడు కూడా మమ్మల్ని మేము ఎలా ప్రేరేపించుకోవాలో, శక్తిని ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు. ఆసియా క్రీడలకు 'ఏ' టీమ్‌ను తీసుకురావడం నిజంగా కలిసి వచ్చింది. పాకిస్థాన్‌తో ఫైనల్‌లో అదే జరిగింది. అందరికీ ఇది ఒక సరైన మ్యాచ్‌లా అనిపించింది" అని వివరించాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ అద్భుత అర్ధసెంచరీలతో రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కూడా గట్టిగానే పోరాడింది. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై దూకుడుగా ఆడి, చివరి వరకు మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చింది. అయితే, భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో పాకిస్థాన్ 6 వికెట్లు కోల్పోయి 192 పరుగులకే పరిమితమైంది.

"చివరకు ఒక మంచి మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. మేం 200 పరుగులు చేశాక పాకిస్థాన్‌కు ఛేజింగ్ కష్టమవుతుందని అనుకున్నాం. కానీ, వికెట్ బాగుండటంతో వాళ్లు కూడా బాగా ఆడారు. ప్రేక్షకులకు ఒక మంచి ఫైనల్ చూసే అవకాశం దక్కింది. ఈ స్వర్ణం మాకు సులభంగా దక్కలేదు. కష్టపడి సాధించాం కాబట్టే ఎక్కువ సంతృప్తినిచ్చింది. మేమంతా చాలా సంతోషంగా ఉన్నాం" అని సంజూ పేర్కొన్నాడు.

ఆసియా క్రీడల ఫైనల్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప అవకాశమని, అయితే ఆట ప్రారంభమయ్యాక పరిస్థితులకు అనుగుణంగానే ఆడామని, ఒత్తిడిని దరిచేరనీయలేదని సంజూ స్పష్టం చేశాడు.

# నేను సాధించలేకపోయాను.. రోహిత్ అయినా దాన్ని అందుకోవాలి: గవాస్కర్



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ తో చివరి వన్డేలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అద్భుత ఫామ్‌తో 92 పరుగులు చేసినప్పటికీ, భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాత్రం అసంతృప్తి వ్యక్తం చేశాడు. సెంచరీకి కేవలం 8 పరుగుల దూరంలో రోహిత్ ఔట్ కావడం తనను నిరాశపరిచిందని అన్నాడు. రోహిత్ శర్మ తన కెరీర్‌ను ఓ ప్రత్యేకమైన మైలురాయితో ముగించాలని తాను కోరుకుంటున్నట్లు గవాస్కర్ ఒక ఆసక్తికర లక్ష్యాన్ని నిర్దేశించాడు. జియోస్టార్‌లో ప్రసారమైన 'హయర్ క్రికెట్ లైవ్' కార్యక్రమంలో గవాస్కర్ మాట్లాడుతూ.. "2027 వన్డే ప్రపంచకప్ తర్వాత సుమారు 40 ఏళ్ల వయసులో రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉంది. నా వ్యక్తిగత కోరిక ఏంటంటే.. అతను రిటైర్ అయ్యే నాటికి అతని వయసు కన్నా ఎక్కువ వన్డే సెంచరీలు చేయాలి. ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 35 సెంచరీలు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో శతకం పూర్తి చేసి ఉంటే, ఆ సంఖ్య 36కు చేరేది. తద్వారా 40 సెంచరీల మార్క్‌కు మరింత దగ్గరయ్యేవాడు" అని అభిప్రాయపడ్డాడు. ఈ సందర్భంగా తన కెరీర్‌లోని చివరి దశను గవాస్కర్ గుర్తుచేసుకున్నాడు. "నాకు 38 ఏళ్ల వయసులో, టెస్టుల్లో 38 సెంచరీలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. కానీ దురదృష్టవశాత్తు మూడుసార్లు 90ల్లో ఔటయ్యాను. అందుకే రోహిత్ సెంచరీ మిస్ కావడం చూసి నిరాశ చెందాను. నేను సాధించలేకపోయాను.. రోహిత్ అయినా ఆ ఘనత అందుకోవాలి" అని అభిలషించాడు. అదే సమయంలో 2023 ప్రపంచకప్ తర్వాత రోహిత్ బ్యాటింగ్ శైలిలో మార్పు వచ్చిందని గవాస్కర్ విశ్లేషించాడు. "ప్రపంచకప్‌లో మొదటి బంతి నుంచే దూకుడుగా ఆడేవాడు. ఇప్పుడు తన వికెట్‌కు ఎక్కువ విలువ ఇస్తున్నాడు. ఇది మంచి పరిణామమే. అయినా, రోహిత్‌ను నేను 30-40 పరుగులు చేసే ఆటగాడిగా కాకుండా, 'సెంచరీల వీరుడు'గానే చూస్తాను" అని స్పష్టం చేశాడు.

# మహేష్ బాబు పేరిట నమోదైన వరస్ట్ రికార్డులు ఏంటంటే.?



'రాజకుమారుడు' సినిమాతో తెలుగు సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నటుడు మహేష్ బాబు...మొదటి సినిమాతోనే ప్రిన్స్ గా తనకంటూ ఒక ట్యాగ్ ను ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తర్వాత చేసిన సినిమాలతో కొంతవరకు మెప్పించినప్పటికి తన పూర్తిస్థాయి నట పోటెన్షియాల్టిని బయటికి తీసిన సినిమా మాత్రం 'నిజం' అనే చెప్పాలి. అందులో ఒక డీసెంట్ యాక్టింగ్ లో మహేష్ బాబు నటన చూసిన చాలా మంది మహేష్ బాబు గొప్ప నటుడు తను ఎలాంటి పాత్రనైనా సరే చేయగలడు అంటూ అతని గురించి గొప్పగా మాట్లాడారు. ఇక ఈ క్రమంలోనే 'ఒక్కడు' సినిమాతో ఆయన మాస్ లో తన ఫ్యాన్ ఫాలోయింగ్ ను విస్తరించుకున్నాడు. అలాగే తన కెరియర్ లోనే మొదటి బ్లాక్ బాస్టర్ సక్సెస్ ని సాధించాడు. పోకిరి, దూకుడు, శ్రీమంతుడు, భరత్ అనే నేను, మహర్షి లాంటి సినిమాలతో ఇండస్ట్రీ రికార్డులను క్రియేట్ చేశాడు. యావత్ తెలుగు సినిమా ప్రేక్షకులందరిని అలరించాడు. అలాంటి మహేష్ బాబు కెరియర్ లో కొన్ని వరస్ట్ రికార్డులు కూడా ఉన్నాయి. మహేష్ అభిమానులు వీటి గురించి మాట్లాడడానికి పెద్దగా ఇష్టపడరు. కానీ మహేష్ బాబు ఎవరినైతే నమ్మాడో వాళ్లే అతనికి వరస్ట్ రికార్డులను కట్టబెట్టారు. అప్పటినుంచి మహేష్ బాబు పూర్తి కథలను విని డేట్స్ ఇవ్వాలని బ్లైండ్ గా ఫిక్స్ అయ్యాడు. తమిళ్ సినిమా ఇండస్ట్రీలో తుపాకీ, కత్తి లాంటి వరుస బ్లాక్ బాస్టర్ సక్సెస్ లను





అందుకున్న మురుగదాస్ డైరెక్షన్లో నటించాలని ఉంది అంటూ మహేష్ బాబు ఒక ఇంటర్వ్యూలో ఓపెన్ గా చెప్పాడు. దాంతో మురుగదాస్ సైతం మహేష్ బాబు నిర్ణయానికి కట్టుబడి 'స్పైడర్' అనే సినిమాని మహేష్ బాబుతో చేద్దామని అతనికి కథను వినిపించాడు. కథ కూడా మహేష్ బాబు ఫైనల్ చేశాడు. మొత్తానికైతే మురుగదాస్ మీద పూర్తి నమ్మకంతో సినిమా ఎలా వస్తుంది ఏంటి అనే విషయాలను కూడా పట్టించుకోని మహేష్ బాబు తనను పూర్తిగా నమ్మాడు. దాంతో కథ విషయంలో కొన్ని మార్పులు చేర్పులు చేసిన మురుగదాస్ మొత్తానికైతే స్పైడర్ సినిమా రూపంలో మహేష్ బాబుకి ఒక భారీ డిజాస్టర్ ను కట్టబెట్టాడు. 120 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా దాదాపు 50 కోట్ల వరకు నష్టాన్ని మిగిల్చింది...

### బ్రహ్మోత్సవం

'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాతో సక్సెస్ ని అందించిన శ్రీకాంత్ అడ్డాల తో మహేష్ బాబు మరో సినిమా చేయాలనుకున్నాడు. ఒక సినిమాతో తనకి సక్సెస్ ను అందించిన దర్శకుడిని మరోసారి రిపీట్ చేస్తూ మూవీ చేయడం మహేష్ కి అప్పట్లో ఆనవాయితీగా మారింది. కాబట్టి సీతమ్మ వాకిట్లో మూవీ తరువాత మరోసారి శ్రీకాంత్ అడ్డాలను సైతం కథ రెడీ చేసుకోమని చెప్పాడు. దాంతో 'బ్రహ్మోత్సవం' కథతో శ్రీకాంత్ మహేష్ బాబు దగ్గరికి వచ్చాడు. నిజానికి మహేష్ బాబు ఆ పూర్తి కథ కూడా వినకుండా కేవలం శ్రీకాంత్ అడ్డాల మీద ఉన్న నమ్మకంతోనే అతనికి సినిమా ఇచ్చాడు. నిజానికి బ్రహ్మోత్సవం సినిమాలో కథ ఏమీ ఉండదు. ఎంతసేపు రిలేషన్ షిప్స్ మీదనే సినిమాను నడిపించే ప్రయత్నం చేశాడు. కానీ అందులో కోర్ ఎలిమెంట్ ఏంటి అనే విషయాన్ని పర్ఫెక్ట్ గా చెప్పలేకపోయాడు. ఎమోషన్స్ సైతం పర్ఫెక్ట్ గా హ్యాండిల్ చేయడంలో దర్శకుడు పూర్తిగా విఫలమయ్యాడు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో బ్రదర్స్ మధ్య బాండింగ్ చాలా గొప్పగా చూపించిన దర్శకుడు బ్రహ్మోత్సవం సినిమా విషయంలో పూర్తిగా చేతులెత్తేశాడు. దానివల్ల ఈ సినిమా భారీ ఫ్లాప్ గా నిలిచింది. దాదాపు 40 కోట్ల వరకు ప్రొడ్యూసర్లకు నష్టాన్ని మిగిల్చింది...

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Old bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com